www.vaarthavedhikasurya.com
RNI NO: TGTEL/25/A0305

# వార్త వేదిక సూర్య

తెలుగు దినపత్రిక

VAARTHA VEDHIKA SURYA - TELUGU DAILY

SCAN ME

యాదాద్రి భువనగిరి | గురువారం, జులై 3, 2025 | ఎడిటర్ : పోలోజు శ్రీనివాసచారి | సంపుటి : 01 | సంచిక: 261 | పేజీలు: 08 | వెల: 5/-

- అన్ని బీమా క్లెయిమ్‌లు అందిస్తాం
- క్షతగాత్రుల వైద్య ఖర్చుల బాధ్యత మాదే
- ప్రమాదంలో 40 మంది మృతి.. 33మందికి గాయాలు
- ప్రభుత్వ దర్యాప్తుకు పూర్తిగా సహకరిస్తాం
- కంపెనీ సెక్రటరీ వివేక్ కుమార్ ప్రకటన



## మృతుల కుటుంబాలకు

# కోటి పరిహారం

**సంగారెడ్డి,జులై2(వార్త వేదిక సూర్య):** పాశమైలారంలో జరిగిన ప్రమాదంపై సిగాచీ కంపెనీ స్పందించింది. పరిశ్రమలో పేలుడు కారణంగా 40 మంది మృతి చెందారని, మరో 33 మంది గాయపడినట్లు పేర్కొంది. మృతుల కుటుంబాలకు రూ.కోటి చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించింది. ప్రమాదంలో గాయపడిన వారికి పూర్తి వైద్యం అందిస్తామని, అన్ని బీమా క్లెయిమ్ ఇస్తామని స్పష్టం చేసింది. బాధిత కుటుంబాలకు అన్నివిధాలా అండగా ఉంటామని సిగాచీ కంపెనీ హామీ ఇచ్చింది. ఈ మేరకు సిగాచీ తరఫున కంపెనీ సెక్రటరీ వివేక్ కుమార్ ఓ ప్రకటన విడుదల చేశారు. 'ప్రమాదంలో 40 మంది మృతి చెందారు. 33 మందికి గాయాలయ్యాయి. మృతుల కుటుంబాలకు పరిశ్రమ నుంచి కోటి పరిహారంతో పాటు అన్ని రకాల బీమా క్లెయిమ్ చెల్లిస్తాం. గాయపడ్డ వారికి పూర్తి వైద్యం అందిస్తాం. బాధిత కుటుంబాలకు అండగా ఉంటాం. పరిశ్రమ ప్రమాదంపై నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్‌కి లేఖ రాశాం. మూడు నెలల పాటు కంపెనీ కార్యకలాపాలు మూసివేస్తున్నాం. ప్రమాదానికి రియాక్టర్ పేలుడు కారణం

మిగతా 2లో..

## మరోమారు పాశమైలారానికి

# మంత్రి దామోదర


- మీనాక్షి, మహేశ్ కుమార్ గౌడ్‌ల రాక
- మంత్రిని నిలదీసిన బాధిత కుటుంబాలు

**సంగారెడ్డి,జులై2(వార్త వేదిక సూర్య):** సిగాచి పరిశ్రమ వద్దకు చేరుకున్న మంత్రి దామోదర రాజనర్సింహను బాధితులు నిలదీసారు. ఆయనపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మంత్రి బుధవారం ఉదయం ఘటనా స్థలికి చేరుకున్నారు. మంత్రి వెంట తెలంగాణ

మిగతా 2లో..



# పాశమైలారం ఘటనపై దర్యాప్తు చేపట్టాలి: ఓవైసీ



**హైదరాబాద్,జులై 2(వార్త వేదిక సూర్య):** సంగారెడ్డి జిల్లాలోని సిగాచీ ఫార్మా కంపెనీలో పేలుడు సంభవించి పెద్ద సంఖ్యలో కార్మికులు, ఉద్యోగులు మరణించిన ఘటనపై ఏఐఎంఐఎం అధ్యక్షుడు అసదుద్దీన్ ఒవైసీ స్పందించారు. అదొక దురదృష్టకరమైన ఘటన అని ఆవేదన వ్యక్తంచేశారు. ఈ ఘటనపై ప్రభుత్వం దర్యాప్తునకు ఆదేశించాలని కోరారు. ఈ ఘటనలో 38 మందికి పైగా ప్రాణాలు కోల్పోయారని, ఇది బాధాకరమైన ఘటన అని అన్నారు. మృతుల్లో ఎక్కువగా జార్ఖండ్‌కు చెందిన వారు ఉన్నారని తెలిపారు. గుర్తించలేనంతగా కాలిపోయిన మృతదేహాలకు డీఎన్ఏ పరీక్షలు చేస్తున్నారని చెప్పారు. సీఎం రేవంత్ రెడ్డి సందర్శించిన తర్వాతనైనా ఘటనపై వేగంగా దర్యాప్తు జరుగుతుందని ఆశిస్తున్నానని అన్నారు.

ఈ ప్రమాదంలో సిగాచీ ఫార్మా ఫ్యాక్టరీ యాజమాన్యం తప్పిదం ఉన్నట్లు తేలితే కఠిన చర్యలు తీసుకోవాలని ఒవైసీ డిమాండ్ చేశారు. కాగా సిగాచీ ఫార్మా కంపెనీలో రియాక్టర్ పేలిపేయి పెద్ద సంఖ్యలో కార్మికులు, ఉద్యోగులు ప్రాణాలు కోల్పోయారు. సోమవారం ఉదయం ఈ ఘటన చోటుచేసుకుంది.



## టిబెట్ బౌద్ధగురువు ఎంపికలో

# చైనా జోక్యం సహించం

- తన వారసత్వం కొనసాగాలా లేదా అన్నది ప్రజలే నిర్ణయిస్తారు
- సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన దలైలామా

**న్యూఢిల్లీ,జులై2(వార్త వేదిక సూర్య):** టిబెట్ బౌద్ధమత అత్యున్నత గురువు దలైలామా తాజాగా చైనాకు షాక్ ఇచ్చారు. 15వ దలైలామా ఎంపిక ప్రక్రియ కొనసాగుతుందని.. దానిని నిర్వహించే అధికారం గాడెన్ ఫోడ్రోంగ్ ట్రస్ట్‌కు మాత్రమే ఉందని తేల్చిచెప్పారు. ఈమేరకు ఆయన సోషల్ మీడియాలో పోస్టు పెట్టారు.తన వారసత్వం కొనసాగాలా, వద్దా అనే విషయాన్ని ప్రజలే నిర్ణయిస్తారని తాను 1969లోనే వెల్లడించినట్లు దలైలామా పేర్కొన్నారు. తాజా అభిప్రాయాల ఆధారంగా గాడెన్ ఫోడ్రోంగ్ ట్రస్ట్ మాత్రమే

మిగతా 2లో..



## పదో తరగతి ఉత్తీర్ణులైన ప్రతి విద్యార్థి ఇంటర్మీడియట్

# పూర్తి చేయాలి

- 9-12 తరగతుల విధానంపై అధ్యయనం చేయండి...
- కేంద్ర ప్రాయోజిత పథకాల నిధులు సాధించాలి...
- యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్స్ ప్రగతిపై నివేదిక సమర్పించాలి..
- విద్యా శాఖ సమీక్షలో ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి...

**హైదరాబాద్,జులై2(వార్త వేదిక సూర్య):** పదో తరగతిలో ఉత్తీర్ణులైన ప్రతి ఒక్క విద్యార్థి తప్పనిసరిగా ఇంటర్మీడియట్ పూర్తి చేసేలా చూడాలని ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. పదో తరగతిలో పెద్ద సంఖ్యలో ఉత్తీర్ణత కనిపిస్తోందని... ఇంటర్మీడియట్ పూర్తయ్యే సరికి

మిగతా 2లో..

- తెలంగాణ రైజింగ్ 2047 విజన్ డాక్యుమెంట్ రూపొందిస్తున్నాం
- హెల్త్ టూరిజం హబ్‌గా హైదరాబాద్ అభివృద్ధి
- బంజారాహిల్స్‌లో ఏఐజి ఆస్పత్రిని ప్రారంభించిన సీఎం
- నాగేశ్వర్ వైద్య సేవలను అభినందించిన రేవంత్




## కార్పోరేట్ ఆస్పత్రులతో

# పోటీగా ప్రభుత్వాసుపత్రులు

**హైదరాబాద్,జులై 2(వార్త వేదిక సూర్య):** రాష్ట్రంలో వివిధ ప్రాంతాల్లో ప్రభుత్వ ఆసుపత్రులు నిర్మాణంలో ఉన్నాయని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. కార్పొరేట్ ఆసుపత్రులతో పోటీపడి ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యం అందిస్తామని స్పష్టంచేశారు .ఒకప్పుడు ఉన్న ఫ్యామిలీ డాక్టర్ వ్యవస్థపోయి ఇప్పుడు స్పెషలిస్ట్ డాక్టర్స్ రోజులు వచ్చాయన్నారు. హెల్త్ ప్రొఫైల్ క్రియేట్ చేయడం ద్వారా దీన్ని బ్రేక్ చేయొచ్చని సీఎం అన్నారు. ప్రపంచ దేశాలతో పోటీ పడగలుగుతున్నామని చెప్పడానికే మిస్ వరల్డ్ పార్టిసిపెంట్స్‌కు ఏఐజీ హాస్పిటల్ విజిట్ లాంటి కార్యక్రమాలు ఏర్పాటు చేశామని ముఖ్యమంత్రి తెలిపారు. గరంలోని బంజారాహిల్స్‌లో ఏఐజీ ఆస్పత్రిని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎం మాటాడుతూ నగర ప్రజలకు రెండో అతిపెద్ద హాస్పిటల్‌ను అందుబాటులోకి తీసుకొచ్చినందుకు డాక్టర్ నాగేశ్వర్ రెడ్డిని అభినందించారు. హైదరాబాద్, తెలంగాణకు నాగేశ్వర్ రెడ్డి గొప్ప పేరు తీసుకొచ్చారని.. ఆయన సేవలను గుర్తించి కేంద్రప్రభుత్వం పద్మవిభూషణ్ ఇచ్చిందని తెలిపారు.

మిగతా 2లో..

## రాష్ట్రానికి యూరియా

# కేటాయించండి

- కేంద్రానికి లేఖ రాసిన మంత్రి తుమ్మల



**హైదరాబాద్,జులై 2(వార్త వేదిక సూర్య):** రాష్ట్రానికి సరిపడేంత యూరియాను కేటాయించాలని కోరుతూ కేంద్రానికి రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు లేఖ రాశారు. యూరియా కొరతను అధిగమించేందుకు తక్షణం చర్యలు చేపట్టాలని కేంద్ర మంత్రి జగత్ ప్రకాశ్‌నడ్డాకు, కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌కు మంత్రి లేఖలు రాశారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనందున రాష్ట్రంలో యూరియా అవసరం అంతకంతకు పెరిగిపోయిందని తెలిపారు. ఏప్రిల్, మే, జూన్ నెలలకు సంబంధించి

మిగతా 2లో..




# వరుస గుండెపోటు మరణాలు!

- కోవిడ్ వ్యాక్సిన్‌లతో సంబంధం లేదు
- పరిశోధనల వివరాలు వెల్లడించిన ఆరోగ్య మంత్రిత్వ శాఖ

**న్యూఢిల్లీ,జులై2(వార్త వేదిక సూర్య):** కరోనా మహమ్మారి తర్వాత దేశంలో ఆకస్మిక మరణాల సంఖ్య పెరుగుతుండటం ఆందోళన కలిగిస్తోంది. ముఖ్యంగా 40 ఏళ్లలోపు వారు

మిగతా 2లో..



## అసెంబ్లీలో మేం చర్చకు సిద్ధం..

# మీరు సిద్ధమా..?



- బనకచర్లపై దుష్ప్రచారాలు ఆపండి
- సీఎం రేవంత్‌కు బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు సవాల్

**హైదరాబాద్,జులై2(వార్త వేదిక సూర్య):** బనకచర్లపై అసెంబ్లీలో చర్చకు తాము రెడీ.. సీఎం రేవంత్‌రెడ్డి సిద్ధమా అని బిఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్‌రావుసవాల్ విసిరారు. బనకచర్లపై అసెంబ్లీ వేదికగా సీఎం రేవంత్‌రెడ్డిని నిలదీస్తామని అన్నారు. బుధవారం తెలంగాణభవన్‌లో హరీష్‌రావు మీడియాతో మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై సంచలన వ్యాఖ్యలు చేశారు. అసెంబ్లీలో బనకచర్లపై చర్చ జరుగుతున్నప్పుడు తమ మైక్ కట్ చేయకూడదని కోరారు. రేవంత్‌రెడ్డి తెలంగాణ ఉద్యమ ద్రోహి.. సీఎం హోదాలోనూ రేవంత్‌రెడ్డి తెలంగాణకు అన్యాయం

మిగతా 2లో..

# మేడారం సమ్మక్క జాతర తేదీలు ఖరారు

- జనవరి 28 నుంచి 31 వరకు నాలుగు రోజుల జాతర




**ములుగు,జులై2(వార్త వేదిక సూర్య):** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే మేడారం సమ్మక్క సారలమ్మ వనదేవతల మహా జాతర తేదీలు ఖరారయ్యాయి. మేడారం మహా జాతర 2026 తేదీలను కోయ పూజారులు ప్రకటించారు. 2026 జనవరి 28 నుంచి 31 వరకు జాతర జరుగనుంది. మేడారంలో 2026లో నిర్వహించే శ్రీ సమ్మక్క సారలమ్మ మహాజాతర తేదీలను పూజారులు ఖరారు చేశారు. జాతర తేదీలను పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్దబోయిన జగ్గారావు ప్రకటించారు. బుధవారం మేడారంలోని ఎండోన్‌మెంట్ కార్యాలయంలో పూజారులు, పుర ప్రజలు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్దబోయిన జగ్గారావు మాట్లాడారు.2026 జనవరి

మిగతా 2లో..

# ఫార్మా భూములపై కాంగ్రెస్ గద్దలు

- అడ్డంగా దోచుకుంటున్న నేతలు
- రైతులను మోసం చేస్తున్నా పట్టించుకోరా: కెటిఆర్



**హైదరాబాద్,జులై 2(వార్త వేదిక సూర్య):** హైదరాబాద్ ఫార్మాసిటీ భూములను కాంగ్రెస్ పార్టీ నేతల దోపిడి చేస్తున్నారంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల్లో గెలవగానే ఫార్మాసిటీ ప్రాజెక్టును రద్దు చేసి, భూములను రైతన్నలకు తిరిగి ఇస్తామని చెప్పిన హామీ ఏమైందని కేటీఆర్ ప్రశ్నించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీని తుంగలో తొక్కిన ముఖ్యమంత్రి, తమ కాంగ్రెస్ లీడర్లతో కలిసి ఫార్మాసిటీ భూములను కొట్టేస్తున్నారు. ఫార్మాసిటీ భూములపై

మిగతా 2లో..



## దేశానికి మోడల్‌గా తెలంగాణ

# డిజాస్టర్ మేనేజ్‌మెంట్

- తెలంగాణ రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ పునర్వ్యవస్థీకరణ
- పరివాహక ప్రాంత నిర్వాసితులకు ఇందిరమ్మ ఇండ్లు
- రెవెన్యూ,సమాచార పౌరసంబంధాల శాఖమంత్రి పొంగులేటి

**హైదరాబాద్,జులై 2 (వార్త వేదిక సూర్య):** ప్రకృతి వైపరీత్యాలను సమర్థవంతంగా ఎదుర్కొని వీలైనంత వరకు ప్రాణ నష్టం, ఆస్తి నష్టం జరగకుండా ఉండేలా తెలంగాణ డిజాస్టర్ మేనేజిమెంట్ అథారిటీని బలోపేతం చేస్తున్నామని రాష్ట్ర రెవెన్యూ,హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. దేశానికి ఒక మోడల్‌గా ఉండేలా వ్యవస్థను రూపొందించాలని అధికారులను ఆదేశించారు. ఇందుకు సంబంధించి తెలంగాణ రాష్ట్ర విపత్తు నిర్వహణా సంస్థ ను పునర్‌వ్యస్థీకరించినట్లు వెల్లడించారు. ఈ సంస్థకు గౌరవ ముఖ్యమంత్రి ఛైర్మన్‌గా ఉంటారని ఇందులో రెవెన్యూ, హోమ్, ఆర్థిక, వైద్య ఆరోగ్యం, భారీ నీటిపారుదల, రహదారులు భవనాలు, పంచాయితీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రులు సభ్యులుగానూ, చీఫ్ సెక్రటరీ మెంబర్ కన్వీనర్‌గాను,

మిగతా 2లో..

www.vaarthavedhikasurya.com
వార్త వేదిక సూర్య
తెలుగు దినపత్రిక
VAARTHA VEDHIKA SURYA - TELUGU DAILY

# మృతుల కుటుంబాలకు కోటి పరిహారం

(మొదటి పేజీ తరువాయి)

కాదు. ప్రమాదంపై తెలంగాణ ప్రభుత్వం దర్యాప్తు చేస్తుంది. ప్రభుత్వ దర్యాప్తు నివేదిక కోసం వేచి చూస్తున్నాం' అని సిగాచీ కంపెనీ సెక్రటరీ వివేక్ కుమార్ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రమాదం ఘటనకు సంబంధించి దర్యాప్తుకు సహకరిస్తామని.. నిబంధనలు పాటిస్తాం అని ప్రకటనలో తెలిపింది. ప్రమాదంలో గాయపడిన వారికి సాయం చేయటంతో పాటు వారి కుటుంబాలకు పునరావాసం కల్పిస్తామని వివేక్ కుమార్ పేర్కొన్నారు. 35 ఏళ్లలో ఎలాంటి ప్రమాదం జరగలేదని.. ఇది ఘోర ప్రమాదని పేర్కొన్నారు. 3 నెలల పాటు కంపెనీని తాత్కాలికంగా మూసివేస్తున్నా ప్రకటించారు. కంపెనీని పదేళ్ల క్రితం ఎలాంగో గౌడకు లీజుకు ఇచ్చామని.. కంపెనీ బాధ్యతలు ఆయనే చూస్తున్నారని తెలిపారు. పేలుడు ఘటనలో ఎలాంగో గౌడ చనిపోవటంతో వివరాలు తెలియడం లేదని తెలిపారు. ప్రమాదంపై స్టాక్ ఎక్స్ఛేంజ్ కు సమాచారం ఇచ్చినట్లు పేర్కొన్నారు. ఇక సిగాచి కంపెనీపై 4 సెక్షన్ల కింద కేసు నమోదైంది. కంపెనీ ఉద్యోగి యశ్వంత్ ఇచ్చిన కంప్లైంట్ తో కేసు నమోదయ్యింది. కంపెనీలో వాడుతున్న పాత మిషనరీ కారణంగా పేలుడు సంభవించినట్లు ఎఫ్ఐఆర్‌లో పోలీసులు పేర్కొన్నారు.

# మరోమారు పాశమైలారానికి మంత్రి దామోదర

(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్ర కాంగ్రెస్ ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్, పీసీసీ ప్రెసిడెంట్ మహేష్ కుమార్ గౌడ్, జగ్గారెడ్డి ఉన్నారు. ఈ సందర్భంగా ప్రమాద స్థలిని వారు పరిశీలించారు. అయితే అధికారుల ముందు బాధితుల బంధువులు ఆందోళనకు దిగారు. మంత్రి దామోదరతో బాధితులు వాగ్వాదానికి దిగారు. మూడు రోజులైనా తమ వారి ఆచూకీ చెప్పడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. చర్యలు చేపడతామంటూ బాధితులను మంత్రి దామోదర రాజనర్సింహ సముదాయించారు. అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడుతూ.. సిగాచి ప్రమాద ఘటనలో ఇప్పటి వరకు 36 మృతదేహాలు లభ్యమయ్యాయని.. 13 మంది మిస్సింగ్‌లో ఉన్నారని తెలిపారు. 11 మంది మృతదేహాలను అప్పగించామన్నారు. ఎఫ్ఎస్ఎల్ రిపోర్ట్ వచ్చాక మిగిలిన మృతదేహాలను వాళ్ళ కుటుంబ సభ్యులకు అప్పగిస్తామని అన్నారు. ప్రతిపక్షాలు దీన్ని రాజకీయం చేస్తున్నారని మండిపడ్డారు. ఈ ఘటనను ప్రభుత్వం చాలా సీరియస్‌గా తీసుకుందని స్పష్టం చేశారు. కంపెనీ యజమాని అందుబాటులోకి వచ్చారని.. ఇప్పటికే కంపెనీపై కేసు నమోదు చేయించామన్నారు. మిగిలిన శిథిలాలు తొలగిస్తే మిగతా 11 మంది ఆచూకీ లభించే అవకాశం ఉందని మంత్రి దామోదర వెల్లడించారు. ఈ ఘటనను కాంగ్రెస్ సీనియర్ నేత రాహుల్ గాంధీ సీరియస్‌గా తీసుకున్నారని రాష్ట్ర కాంగ్రెస్ ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్ తెలిపారు. బాధితులకు నష్టపరిహారాన్ని ప్రభుత్వం ఇప్పటికే చెల్లించిందని.. కంపెనీ నుంచి కూడా బాధితులకు నష్టపరిహారం అందజేసేలా చూస్తామని అన్నారు. ఈ ఘటనపై ఇప్పటికే కమిటీ వేశామని మీనాక్షి తెలియజేశారు. ముఖ్యమంత్రి, మంత్రులు ఈ ఘటనపై ఎప్పటికప్పుడు ఆరా తీస్తున్నారని టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ తెలిపారు. క్షతగాత్రులకు మెరుగైన చికిత్స అందిస్తున్నామని చెప్పారు. మృతదేహాలను ప్రత్యేకంగా ఫ్రీజర్లలో మార్చురీలో భద్రపరిచామన్నారు. గాయపడిన వారికి కంపెనీ పరంగా ఆదుకుంటామన్నారు. ఈ ఘటనను ప్రభుత్వం చాలా సీరియస్‌గా తీసుకుందని మహేష్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు. మరోవైపు సిగాచి పరిశ్రమలో మూడోరోజు సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. భారీ క్రేన్లు, జేసీబీలతో శిథిలాల తొలగింపు పనులు కొనసాగుతున్నాయి. అయితే తమ వారి ఆచూకీ తెలియడంలేదంటూ ఘటనా స్థలిలో బంధువుల ఆందోళనకు దిగారు.

### టిబెట్ బౌద్ధగురువు ఎంపికలో

# చైనా జోక్యం సహించం

(మొదటి పేజీ తరువాయి)

దలైలామా పునర్జన్మను నిర్ణయిస్తుందని.. ఈ ప్రక్రియలో మరెవరికీ జోక్యం చేసుకొనే అధికారం లేదని తేల్చిచెప్పారు. 2011 సెప్టెంబర్ 24నే తాను టిబెట్ బౌద్ధ మత పెద్దలు, నాయకులు, ఇతర సంస్థలతో భేటీ నిర్వహించి.. తన వారసుడి ఎంపిక కొనసాగించాలా..? అనే అంశంపై అభిప్రాయాలు కోరినట్లు పేర్కొన్నారు. దీనికి అన్నివర్గాల నుంచి సానుకూల స్పందనలు వచ్చాయన్నారు. స్పందించిన వారిలో టిబెట్ మతపెద్దలు, చైనాలోని వారు కూడా ఉన్నట్లు వెల్లడించారు. తన వారసత్వం భవిష్యత్తులో కొనసాగాలని వారంతా కోరుకున్నట్లు తెలిపారు. చాలా ఏళ్ల క్రితం దలైలామా ఒక దశలో తనతోనే ఈ సంప్రదాయం ముగిసిపోతుందని ఆందోళన చెందారు. కానీ, ఆ తర్వాత తన పునర్జన్మ టిబెట్ బయట జరగొచ్చని చెప్పారు. టిబెట్‌ను గుప్పిట పెట్టుకోవడానికి తమ చెప్పుచేతల్లో ఉండే కీలుబొమ్మను దలైలామా వారసుడిగా ఎంపిక చేయాలని చైనా ఎప్పటినుంచో ఉబలాటపడుతోంది. ఆ ప్రాంతాన్ని 1950లో ఆక్రమించిన చైనా ఆ తరవాత దాన్ని తన భూభాగంలోకి మార్చేందుకు ఎన్నో ప్రయత్నాలు చేసింది. ముఖ్యంగా చైనీస్ మూలాలున్న హన్ జాతి ప్రజలు ఇబ్బడిముబ్బడిగా టిబెట్‌లో స్థిరపడేలా చేసింది. ఆక్రమణ తరవాత లక్షల సంఖ్యలో అక్కడి చిన్నారులను దూర ప్రాంతాలకు తరలించి వారికి బ్రెయిన్ వాష్ చేసింది. అక్కడి పీఠభూమిలో విస్తారంగా బొగ్గు, రాగి, క్రోమియం, లిథియం, జింక్, సీసం, బోరాన్ నిక్షేపాలు ఉండడంతో వాటిపైనా చైనా కన్నేసింది. టిబెట్‌పై పట్టు కోసం భవిష్యత్తులో దలైలామా స్థానాన్ని కబ్జా చేయాలని చైనా భావించింది. ఆ స్థానం ఎంపికలో పంచయిన్ లామా పాత్ర చాలా కీలకం. టిబెట్‌లోనే ఉండిపోయిన పంచయిన్ లామా 1989లో అనుమానాస్పద స్థితిలో మరణించారు. ఆయనపై విష ప్రయోగం చేశారంటారు. పంచయిన్ లామా వారసుడిగా ఎంపికైన బాలుడిని తన అధీనంలో ఉంచుకొన్నట్లు కొన్నేళ్ల కిందట బీజింగ్ ప్రకటించింది. ఈ ఎత్తుగడలను గ్రహించిన దలైలామా తన పునర్జన్మ టిబెట్ బయట కూడా జరగొచ్చని ప్రకటించారు. దీంతోపాటు వారసుడిని ఎంపిక చేసే ప్రక్రియ కూడా తమదేనని తేల్చిచెప్పారు.

# మేడారం సమ్మక్క జాతర తేదీలు ఖరారు

(మొదటి పేజీ తరువాయి)

28వ తేదీ నుంచి మేడారం జాతర ప్రారంభం అవుతుందని తెలిపారు. 28న బుధవారం సాయంత్రం కన్నెపల్లి నుండి సారలమ్మ, పూనుగొండ్ల నుండి పగిడిద్దరాజు, కొండాయి నుండి గోవిందరాజులను గద్దెలపైకి తీసుకొస్తారని, జనవరి 29వ సాయంత్రం చిలుకలగుట్ట నుండి సమ్మక్క తల్లిని గద్దె మీదకు తీసుకొస్తారని తెలిపారు. అదేవిధంగా జనవరి 30వ తేదీన వన దేవతలకు మొక్కులు చెల్లింపులు, జనవరి 31వ తేదీన తల్లుల వన ప్రవేశం ఉంటుందని ప్రకటించారు. అనివార్య కారణాల రీత్యా 2024 జాతర తేదీలను 9 నెలల ముందుగానే ప్రకటించారు. నాలుగు రోజుల పాటు ఈ జాతర జరుగుతుంది. ఆపై 30న వన దేవతలకు భక్తులు తమ తమ మొక్కులను చెల్లించే కార్యక్రమం ఉంటుంది. 31న సాయంత్రం 6 గంటల సమయంలో సమ్మక్క, సారలమ్మ దేవతలు, గోవింద రాజు, పగిడిద్ద రాజు దేవుళ్ల వన ప్రవేశంతో జాతర ముగుస్తుందని కోయ పూజారులు వెల్లడించారు. ఈ జాతరకు ఏర్పాట్లు చేయాల్సిందిగా కాంగ్రెస్ ప్రభుత్వాన్ని పూజారులు కోరుతున్నారు. కాగా.. తెలంగాణ కుంభమేళాగా పేరుగాంచిన మేడారం జాతరకు తెలుగు రాష్ట్రాలతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి కూడా పెద్ద సంఖ్యలో భక్తులు తరలివస్తుంటారు. ములుగు జిల్లాలోని తాడ్వాయి మండలం మేడారం జాతర జరుగుతుంది. ప్రతీ రెండు సంవత్సరాలకు ఒకసారి ఈ జాతరను నిర్వహిస్తుంటారు. ఇది ప్రపంచంలోనే అతి పెద్ద గిరిజన పండుగగా ప్రసిద్ధి చెందింది.

# ఫార్మా భూములపై కాంగ్రెస్ గద్దలు

(మొదటి పేజీ తరువాయి)

కాంగ్రెస్ నేతలు గద్దల మాదిరి వాలి దోచుకుంటున్నారు. ఫార్మాసిటీ కోసం భూములు ఇచ్చిన రైతన్నలకు నష్టపరిహారంగా కేటాయించిన ఇండ్ల స్థలాలను కాంగ్రెస్ నేతలు తమ పేర్లపై అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకుంటున్నారు. రైతన్నలకు దక్కాల్సిన ఇండ్ల స్థలాలను అతి తక్కువ రేట్లకు బలవంతంగా రిజిస్ట్రేషన్ చేసుకుంటున్నారు. రైతన్నలకు నష్టపరిహారం గా దక్కాల్సిన దానిని కాంగ్రెస్ నేతలు ఎందుకు దోచుకుంటున్నారని నిలదీసారు. రాష్ట్ర అభివృద్ధి కోసం భూములు ఇచ్చిన రైతన్నలను కూడా వదలకుండా, దోపిడి చేస్తున్న కాంగ్రెస్ పార్టీ తీరు సిగ్గుచేటు అని కేటీఆర్ మండిపడ్డారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు మరిచిపోయి, ఇప్పుడు రైతులకు ఇవ్వాల్సిన భూములను కాంగ్రెస్ నేతలు స్వాధీనం చేసుకుంటున్నారన్న ఆరోపణలు చేశారు. కేటీఆర్ ఎక్స్ వేదికగా చేసిన పోస్ట్‌లో, 'రంగారెడ్డి జిల్లాలో ఫార్మాసిటీ కోసం భూములు ఇచ్చిన రైతులకు ప్రభుత్వం ఇప్పటి వరకు హక్కుగా రావాల్సిన ఇంటి స్థలాలను ఇవ్వలేదు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హామీ ఇచ్చినట్టు, మీర్‌ఖాన్‌పేట లేఅవుట్‌లో పొజిషన్ ఇవ్వడమైతే ఫలించలేదని గుర్తు చేశారు.రాష్ట్ర అభివృద్ధికి తమ భూములు ఇచ్చిన రైతన్నలను వదలకుండా, నష్టపరిహారంగా ఇచ్చే భూముల్ని కూడా దోచుకుంటున్న తీరు సిగ్గుచేటు అంటూ కాంగ్రెస్ ప్రభుత్వంపై కేటీఆర్ మండిపడ్డారు.

# శ్రీశైలానికి కొనసాగుతున్న వరద ఉధృతి

**శ్రీశైలం,జులై2(వార్త వేదిక సూర్య):** శ్రీశైలం జలాశయానికి వరద నీటి ప్రవాహం కొనసాగుతూనే ఉన్నది. జూరాల నుంచి శ్రీశైలానికి 83.224 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతున్నది. అదే విధంగా జలాశయం పూర్తిస్థాయి నీటినిల్వ 885 అడుగులు కాగా ప్రస్తుతం ప్రస్తుత నీటిమట్టం 875.2 అడుగులు ఉండగా పూర్తిస్థాయి నీటిసామర్థ్యం 215.8 టీఎంసీలు కాగా ప్రస్తుతం 164.7 టీఎంసీలు ఉన్నాయి. శ్రీశైలం కుడి, ఎడమ గట్టు విద్యుత్ కేంద్రాలో విద్యుదుత్పత్తి కొనసాగుతున్నట్లు అధికారులు తెలిపారు. విద్యుత్ ఉత్తత్తి చేసి35,315 క్యూసెక్కులు దిగువన ఉన్న నాగార్జునసాగర్‌కు విడుదల చేస్తున్నారు.

# కార్పోరేట్ ఆస్పత్రులతో పోటీగా ప్రభుత్వాసుపత్రులు

(మొదటి పేజీ తరువాయి)

నాగేశ్వర్ రెడ్డి భారతరత్నకు అర్హులన్నారు. ఆయనకు భారతరత్న వచ్చేలా తెలంగాణ నుంచి తన వంతు ప్రయత్నం చేస్తానని చెప్పారు. 66 దేశాల నుంచి పేషంట్స్ ఏఐజీ ఆసుపత్రిలో చికిత్సకు వస్తున్నారని ఇది గర్వకారణమన్నారు. ఇకపోతే గోశామహల్ లో నూతన ఉస్మానియా ఆసుపత్రిని నిర్మించబోతున్నామని.. పనులు కూడా ప్రారంభమయ్యాయని అన్నారు. నిర్మాణంలో ఉన్న వివిధ ఆసుపత్రులు పూర్తయితే మొత్తం 7 వేల పడకలు అందుబాటులోకి వస్తాయని చెప్పారు. తెలంగాణ రైజింగ్ 2047 విజన్ డాక్యుమెంట్ రూపొందిస్తున్నామని.. అందులో హెల్త్ టూరిజం ఒక చాప్టర్‌గా ఉంటుందని సీఎం తెలిపారు.

హైదరాబాద్‌ను హెల్త్ టూరిజం హబ్‌గా మార్చేందుకు ప్రయత్నిస్తున్నామని.. అందులో భాగంగానే డాక్టర్ నోరి దత్తాత్రేయుడిని క్యాన్సర్ కేర్ సలహాదారుడిగా నియమించామన్నారు. తెలంగాణ రాష్ట్రం చేపట్టే ప్రణాళికలో డాక్టర్ నాగేశ్వర్ రెడ్డిని కూడా భాగస్వాములు కావాల్సిందిగా ముఖ్యమంత్రి




కోరారు. ఆరోగ్యశ్రీ ద్వారా రూ. 10 లక్షల వరకు ప్రభుత్వం పేదలకు ఉచిత వైద్యం అందిస్తోందన్నారు. సమస్య రాకుండా ముందు జాగ్రత్తలు చేపట్టాల్సిన అవసరం ఉందని.. ఇందుకు సరైన విధానంతో ముందుకు వెళుతున్నామని వెల్లడించారు. సెల్ఫ్ హెల్ప్ గ్రూప్ మహిళలకు హెల్త్ ప్రొఫైల్ కార్డును క్రియేట్ చేయాలని భావిస్తున్నామన్నారు.

ఒక యూనిక్ ఐడీతో ఈ హెల్త్ ప్రొఫైల్ కార్డులు ఉంటాయని తెలిపారు. వైద్య రంగం అభివృద్ధికి రూ.11500 కోట్లు కేటాయించామని.. రూ.21500 కోట్లు విద్యా రంగం అభివృద్ధికి కేటాయించామని తెలిపారు. పేదలకు ఉచిత వైద్యం, నాణ్యమైన విద్య అందించాలనే ప్రణాళికలతో ముందుకు వెళ్తున్నాని పేర్కొన్నారు. వైద్యులు ఏడాదిలో ఒక నెల రోజులు సామాజిక బాధ్యతగా ప్రభుత్వ ఆసుపత్రులలో సేవలందించాలన్నారు. సాంకేతిక రంగంలో ప్రపంచంలో హైదరాబాద్ కూడా ఒక వేదికగా మారిందని అన్నారు.

మిడిల్ ఈస్ట్ దేశాల నుంచి హైదరాబాద్‌కు డైరెక్ట్ కనెక్టివిటీ పెంచేలా కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడుతున్నామని.. కనెక్టివిటీ పెరిగితే హైదరాబాద్ మరింత అభివృద్ధి చెందుతుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.

### దేశానికి మోడల్‌గా తెలంగాణ

# డిజాస్టర్ మేనేజ్‌మెంట్

(మొదటి పేజీ తరువాయి)

రెవెన్యూశాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ప్రత్యేక ఆహ్వానితునిగా ఉంటారని తెలిపారు. బుధవారం రాష్ట్ర సచివాలయంలో గోదావరి మరియు కృష్ణా నదీ పరివాహక జిల్లాల్లో వరద నిర్వహణపై ఆయా జిల్లాల కలెక్టర్లు , ఇతర ఉన్నతాధికారులతో చీఫ్ సెక్‌లటరీ కె. రామకృష్ణారావు, విపత్తుల నిర్వహణ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అరవింద్ కుమార్‌తో కలిసి సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా మంత్రిగారు మాట్లాడుతూ 'వాతావరణ మార్పుల వల్ల ఆకస్మికంగా వచ్చే వరదలు, వర్షాల సమాచారాన్ని ఐఎండీతో సమన్వయం చేసుకొని శాస్త్రీయంగా విశ్లేషించుకొని ఎప్పటికప్పుడు పై స్థాయి నుంచి కింది స్థాయి వరకు అందించేలా వ్యవస్థను రూపొందించుకోవాలి. సమాచార వ్యవస్థ మరింత బలోపేతం కావాలని అన్నారు. రాష్ట్ర స్థాయిలో వర్షాలు, వరదలకు సంబంధం ఉన్న ఇరిగేషన్, విద్యుత్, హెల్త్, వ్యవసాయం, పోలీస్, రవాణా తదితర విభాగాలకు ప్రత్యేక నోడల్ అధికారులను నియమిస్తున్నాం. ప్రకృతి వైపరీత్యాలను మనం అడ్డుకోలేం కానీ వాటి ప్రభావాన్ని తగ్గించడానికి ముందస్తుగా పటిష్టమైన చర్యలు తీసుకుంటే నష్టాన్ని వీలైనంతవరకు తగ్గించగలుగుతాం. ప్రధానంగా కృష్ణా గోదావరి పరీవాహక ప్రాంతాల అధికార యంత్రాంగం వరద ముంపును ముందుగానే గుర్తించి ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలి. దీనివలన మనం నష్టాన్ని తగ్గించినవారమవుతాం అన్నారు.నదీపరివాహక ప్రాంతాల్లో ఏ మేరకు వరద ఉధృతి వస్తే ఏఏ గ్రామాలు ముంపునకు గురౌతాయోనన్న సమాచారాన్ని నీటిపారుదల శాఖ ముందుగానే అందించాలి. ఇతర రాష్ట్రాలలో వచ్చే వరద వివరాలు, స్థానికంగా పడిన వర్షం వివరాలు, ఎంత నీటిని విడుదల చే?స్తారనే విషయాలు సవివరంగా ఉండాలి. నదీ పరివాహక ప్రాంతాల్లోని నివాసితులను వరదలు వచ్చిన ప్రతిసారీ సురక్షిత ప్రాంతాలకు తరలించడం కంటే వారికి శాశ్వత నివాసం కల్పించాలి. ఇందుకు సంబంధించి నివాసితుల వివరాలను గుర్తిస్తే అదనపు కోటా కింద ఇందిరమ్మ ఇండ్లను నిర్మించి ఇస్తామని తెలిపారు. భారీ వర్షాలు, వరదల సమయంలో వాగుల్లో వంకల్లో చెరువుల్లో చిక్కుకున్నవారిని రక్షించడానికి ఎయిర్ లిఫ్ట్ మెకానిజాన్ని సిద్ధం చేసుకోవాలి. ఈ ఎయిర్ లిఫ్ట్ వ్యవస్థ సరిగా లేకపోవడం వల్ల గత ఏడాది నా నియోజకవర్గం పాలేరులో చిక్కుకున్న బాధితులను రక్షించుకోలేకపోయానని ఈ సందర్భంగా మంత్రిగారు ఆవేదన వ్యక్తం చేశారు.

ఎయిర్ లిఫ్ట్ మెకానిజం ఏవిధంగా ఉండాలి, విపత్తు సంభవించిన ప్రాంతానికి ఏవిధంగా చేరుకోవాలి వంటి అంశాలపై అధ్యయనం చేయాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో రాష్ట్ర విపత్తుల నిర్వహణ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అరవింద్ కుమార్, సెక్రటరీ శివశంకర్, అగ్నిమాపక శాఖ డైరెక్టర్ జనరల్ నాగిరెడ్డి, హైడ్రా కమిషనర్ రంగనాథ్, పంచాయితీరాజ్ కమిషనర్ సృజన, సిపి డిసిఎల్ డైరెక్టర్ ముష్రాఫ్ అలీ, వ్యవసాయ సహకార శాఖ డైరెక్టర్ బి. గోపి. ఐఎండీ అధికారిణి నాగరత్నం. సివిల్ సప్లయిస్ డైరెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

### అసెంబ్లీలో మేం చర్చకు సిద్ధం..

# మీరు సిద్ధమా..?

(మొదటి పేజీ తరువాయి)

చేస్తున్నారని ఆరోపణలు చేశారు. రేవంత్‌రెడ్డి తెలంగాణకు పట్టిన అబద్దాల వైరస్ అని మాజీ మంత్రి హరీష్‌రావు ఎద్దేవా చేశారు. బయట వారికి సద్దులు కడుతూ.. ఇంటి మనిషి కేసీఆర్‌పై నిందలు వేస్తున్నారని ధ్వజమెత్తారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఇచ్చిన పవర్ పాయింట్ ప్రజెంటేషన్ .. హైదరాబాద్‌లో కాకుండా అమరావతి నుంచి ఇచ్చినట్లుందని విమర్శించారు.ఉత్తమ్ పీపీటీ.. ఏపీ సీఎం చంద్రబాబు తయారు చేశాడా అనే అనుమానం కలుగుతోందని అన్నారు. చంద్రబాబు తెలంగాణ ప్రాజెక్ట్‌లను అడ్డుకున్న విషయాన్ని పీపీటీలో ఎందుకు చూపించలేదని ప్రశ్నించారు. అహంకారంతో మాట్లాడితే.. రేవంత్‌ను ప్రజలు పాతాళానికి తొక్కుతారని హెచ్చరించారు. తెలుగుదేశం, చంద్రబాబుతో ఉన్న అనుబంధాన్ని రేవంత్‌రెడ్డి ఇంకా మర్చిపోలేకపోతున్నారని విమర్శించారు మాజీ మంత్రి హరీష్‌రావు. విభజన హామీల ముసుగులో ప్రజాభవన్ వేదికగా బనకచర్ల ఒప్పందం కుదిరిందని, ప్రజాభవన్ వేదికగా 2024 జులై 6వ తేదీన రేవంత్ తెలంగాణకు మరణశాసనం రాశారని మాజీ మంత్రి హరీష్‌రావు ఆరోపణలు చేశారు. సెప్టెంబర్ 23వ తేదీన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సతీసమేతంగా బెజవాడ పోయి బజ్జీలు తిని బనకచర్లకు పచ్చజెండా ఊపారని విమర్శించారు.

బీఆర్ఎస్ పోరాటంతోనే కేంద్ర ప్రభుత్వం బనకచర్లకు అనుమతులు ఇవ్వలేదని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ చచ్చిన పాము అయితే.. ఎందుకు తమపై విమర్శలు చేస్తున్నారని నిలదీశారు. కేసీఆర్ పేరు ఎత్తకుండా ఒక్కసారైనా రేవంత్‌రెడ్డి ఉండగలరా అని ప్రశ్నించారు. ముఖ్యమంత్రిగా కాకుండా.. రేవంత్‌రెడ్డి ఇంకా ప్రతిపక్ష నేత మాదిరిగా మాట్లాడుతున్నారని విమర్శించారు. ఇరు రాష్ట్రాలు కూర్చుని ఆమోదయోగ్యంగా మాట్లాడుకుందామని మాత్రమే కేసీఆర్ అన్నారని తేల్చిచెప్పారు

మాజీ మంత్రి హరీష్‌రావు. బీఆర్ఎస్ హయాంలో బనకచర్లపై ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదని మాజీ మంత్రి హరీష్‌రావు క్లారిటీ ఇచ్చారు. రేవంత్‌రెడ్డే సతీసమేతంగా ఉత్తమ్‌ను విజయవాడ పంపించారని ఆరోపించారు. చాలా రాష్ట్రాల్లో కాంగ్రెస్ పార్టీ ఒక్క ఎమ్మెల్యే, ఎంపీ సీటు కూడా గెలవలేదని.. అంతమాత్రాన ఆ పార్టీ చచ్చిన పాము అవుతుందా అని ప్రశ్నించారు.

చచ్చిన పాము ముచ్చట్లు రేవంత్‌రెడ్డి రాహుల్ గాంధీకి చెప్పుకోవాలని ఎద్దేవా చేశారు. రేవంత్‌రెడ్డి చెప్పేవన్నీ అబద్దాలేనని మండిపడ్డారు. తెలంగాణ రాష్ట్ర హక్కుల కోసం కాకుండా.. రాజకీయ ప్రయోజనాల కోసమే రేవంత్ మాట్లాడుతున్నార్ని ÷ర్ అయ్యారు. బనకచర్లపై మంత్రి ఉత్తమ్ ఇచ్చిన పవర్ పాయింట్ ప్రెజెంటేషన్‌కు ప్రతిపక్ష పార్టీల ఎమ్మెల్యేలను ఎందుకు పిలవలేదని మాజీ మంత్రి హరీష్‌రావు ప్రశ్నల వర్షం కురిపించారు.

# పదో తరగతి ఉత్తీర్ణులైన ప్రతి విద్యార్థి ఇంటర్మీడియట్ పూర్తి చేయాలి

(మొదటి పేజీ తరువాయి)

ఆ సంఖ్య గణనీయంగా తగ్గిపోవడానికి గల సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. విద్యా శాఖపై ఐసీసీసీలో ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి సమీక్ష నిర్వహించారు. విద్యార్థి జీవితంలో ఇంటర్మీడియట్ దశ కీలకమైనందున.. ఆ దశలో విద్యార్థికి సరైన మార్గదర్శకత్వం లభించాల్సిన అవసరం ఉందని సీఎం అభిప్రాయపడ్డారు. ఇతర రాష్ట్రాల్లో 9వ తరగతి నుంచి 12వ తరగతి వరకు ఉంటుందని.. అక్కడ డ్రాపౌట్స్ సంఖ్య తక్కువగా ఉందని అధికారులు సీఎంకు తెలియజేశారు. ఇంటర్మీడియట్ వేరుగా.. 12వ తరగతి వరకు పాఠశాలలు ఉన్న రాష్ట్రాల్లో అధికారులు అధ్యయనం చేసి ఈ విధానంపై సమగ్ర నివేదిక సమర్పించాలని ఆదేశించారు. ఈ విషయంలో విద్యా కమిషన్, ఆ విభాగంలో పని చేసే ఎన్జీవోలు, పౌర సమాజం సూచనలు, సలహాలను పరిగణనలోకి తీసుకోవాలని సీఎం సూచించారు. ఇంటర్మీడియట్ విద్య మెరుగుకు అన్ని దశల్లో చర్చించి శాసనసభలోనూ చర్చకు పెడతామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ఇంటర్మీడియట్‌లో విద్యార్థుల చేరికతో పాటు వారి హాజరుపైనా దృష్టిపెట్టాలన్నారు. యంగ్ ఇండియా రెసిడెన్షియల్స్ స్కూళ్ల నమూనాలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పరిశీలించారు. ప్రతి పాఠశాల ఆవరణలో భారీ జాతీయ జెండా ఏర్పాటు చేయాలని సీఎం సూచించారు. పాఠశాలల నిర్మాణం ప్రక్రియను వేగవంతం చేయాలని , నిర్మాణాల ప్రగతిపై ప్రతి వారం తనకు నివేదిక సమర్పించాలని సీఎం అధికారులను ఆదేశించారు. ప్రతి నియోజకవర్గంలో బాలురకు ఒకటి, బాలికలకు ఒకటి యంగ్ ఇండియా రెసిడెన్షియల్స్ స్కూళ్ల నిర్మాణాలను చేపడతామన్నారు. ఇప్పటికే ఒక్కో పాఠశాలకు సంబంధించి స్థల సేకరణ పూర్తయినందున, రెండో పాఠశాలకు సంబంధించిన స్థల గుర్తింపు, సేకరణ ప్రక్రియపై దృష్టి సారించాలని సీఎం ఆదేశించారు. వీరనారి చాకలి ఐలమ్మ మహిళా విశ్వ విద్యాలయం నిర్మాణ నమూనాను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పరిశీలించారు. పలు మార్పులను సూచించారు. సాధ్యమైనంత త్వరగా టెండర్ల ప్రక్రియను పూర్తి చేయాలని సీఎం ఆదేశించారు. సమీక్షలో ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు కేశవరావు, ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి, విద్యా శాఖ కార్యదర్శి యోగితా రాణా, ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ బాలకిష్టారెడ్డి, సాంకేతిక విద్యా శాఖ కమిషనర్ శ్రీదేవసేన, విద్యా శాఖ ప్రత్యేక కార్యదర్శి హరిత, జేఎన్టీయూ రిజిస్ట్రార్ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# వరుస గుండెపోటు మరణాలు!

(మొదటి పేజీ తరువాయి)

కూడా కార్డియాక్ అరెస్ట్‌తో ప్రాణాలు కోల్పో తుండటం కలవరపెడుతోంది. కర్నాటకలోని హసన్ జిల్లాలో వరుస గుండెపోటు మరణాలపై ఆందోళన వ్యక్తం అవుతోంది. ఈ నేపథ్యంలో ఐసీఎంఆర్, ఎయిమ్స్ వంటి సంస్థలు దీనిపై పరిశోధనలు చేపట్టి కీలక విషయాలు వెల్లడించాయి. ఈ మరణాలకు, కొవిడ్ వ్యాక్సిన్లతోఎలాంటి సంబంధం లేదని తమ అధ్యయనాల్లో తేలినట్లు స్పష్టం చేశాయి. మునుపటి అనారోగ్య సమస్యల ప్రభావమే ఆయా వ్యక్తుల మరణాల్లో కీలక అంశమని పేర్కొన్నాయి. ఈమేరకు అధ్యయనాల నివేదికలను కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ తాజాగా ప్రకటించింది. జన్యుపరమైన సమస్యలు, జీవన శైలి, మునపటి అనారోగ్యాలు.. ఇలా ఏవైనా కావొచ్చు' అని అధ్యయనాల్లో తెలిపాయి. ఈ ఆకస్మిక మరణాలకు కొవిడ్ టీకాలే కారణమంటూ జరుగుతున్న ప్రచారం పూర్తిగా అవాస్తవమని, తప్పుదోవ పట్టించేవేనని పునరుద్ఘాటిం చాయి. ఆధారాల్లేకుండా చేసే ఇలాంటి ప్రచారాలు వ్యాక్సిన్లపై విశ్వసనీయతను దెబ్బతీస్తాయని ఆందోళన వ్యక్తంచేశాయి. కొవిడ్ మహమ్మారి సమయంలో ఈ టీకాల వల్లే ఎంతోమంది ప్రాణాలు నిలిచాయని గుర్తుచేశాయి. 18-45 ఏళ్ల వయసు వారిలో ఆకస్మిక మరణాలు సంభవించడంపై ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ (ఐసీఎంఆర్), నేషనల్ సెంటర్ ఫర్ డిసీజ్ కంట్రోల్ (ఎన్‌సీడీసీ), ఎయిమ్స్ పరిశోధనలు చేశాయి. 2023 మే-ఆగస్టు మధ్య 19 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లోని పలు ఆసుపత్రుల్లో సర్వే చేశాయి. ఆరోగ్యంగా కన్పించినప్పటికీ 2021 అక్టోబరు నుంచి 2023 మార్చి మధ్య ఉన్నట్టుండి మరణించిన వారి డేటాను పరిశీలించాయి. వీటిని అధ్యయనం చేసిన తర్వాత ఈ ఆకస్మిక మరణాలకు కొవిడ్ వ్యాక్సిన్లతో ఎలాంటి సంబంధం లేదని గుర్తించినట్లు ఆయా సంస్థలు వెల్లడించాయి. 'భారత్‌లో కొవిడ్ వ్యాక్సిన్లు సురక్షితం, సమర్థవంతమైనవి. వీటివల్ల దుష్ప్రభావాలు చాలా అరుదైన సందర్భాల్లో మాత్రమే కన్పించాయి. గుండె సంబంధిత ఆకస్మిక మరణాలకు అనేక కారణాలు ఉన్నాయి.

# కొన్ని వస్తువులపై జీఎస్టీ భారం తగ్గింపు!

### ప్రభుత్వ యోచనలో ఉన్నట్లు సమాచారం

**న్యూఢిల్లీ,జులై2(వార్త వేదిక సూర్య):** ఈ ఏడాది ఆదాయ పన్నుల రాయితీల రూపంలో మధ్యతరగతి వర్గానికి ఉపశమనం కల్పించిన కేంద్ర ప్రభుత్వం మరో చర్యకు సిద్ధమవుతోంది. మధ్యతరగతి, తక్కువ ఆదాయ కుటుంబాలను దృష్టిలో ఉంచుకుని వస్తు సేవల పన్ను(జీఎస్‌టీ) తగ్గించాలని భావిస్తున్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. 12 శాతం జీఎస్టీ స్లాబ్‌ను పూర్తిగా తొలగించం లేదా ప్రస్తుతం 12 శాతం పన్ను విధించబడుతున్న అనేక వస్తువులను దిగువన 5 శాతంలోకి తిరిగి చేర్చడం వంటి వాటి గురించి కేంద్రం ఆలోచిస్తోంది. ఈ అరేంజ్మెంట్ మధ్యతరగతి, ఆర్థికంగా బలహీన వర్గాలు ఉపయోగించే టూత్‌పేస్ట్, టూత్ పౌడర్, డుగులు, కుట్టు యంత్రాలు, ప్రెషర్ కుక్కర్లు మరియు వంటగది పాత్రలు, ఎలక్ట్రిక్ ఐరన్‌లు, గీజర్‌లు, చిన్న సామర్థ్యం గల వాషింగ్ మెషీన్లు, సైకిళ్లు, రూ. 1,000 కంటే ఎక్కువ ధర కలిగిన రెడీమేడ్ దుస్తులు, రూ. 500 నుండి రూ. 1,000 మధ్య ధర కలిగిన పాదరక్షలు, స్టేషనరీ వస్తువులు, టీకాలు, సిరామిక్ టైల్స్, వ్యవసాయ ఉపకరణాలు వంటి వాటి ధరలు తగ్గే అవకాశం ఉంది. మార్పులు అమలు చేయబడితే ఈ వస్తువులు చాలా వరకు తక్కువ ధరలకు వస్తాయి. మరోవైపు, ప్రభుత్వం సరళీకృతమైన, సులభంగా పాటించే జీఎస్టీని కూడా పరిశీలిస్తోంది. అయితే, ఈ చర్యల వల్ల ప్రభుత్వంపై రూ. 40,000 కోట్ల నుంచి రూ. 50,000 కోట్ల వరకు భారాన్ని మోపుతుందని తెలుస్తోంది. అయితే, వినియోగం పెరిగితే జీఎస్టీ వసూల్లు పెరుగుతాయని కేంద్రం నమ్ముతోంది.

### రాష్ట్రానికి యూరియా

# కేటాయించండి

(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్రానికి 5 లక్షల మెట్రిక్ టన్నుల కోటాను కేంద్ర ప్రభుత్వం నిర్దేశిరచిందని.. అందులో ఇప్పటి వరకు 3.06 లక్షల టన్నుల యూరియా రాష్ట్రానికి సరఫరా అయిందని చెప్పారు.అరకొర సరఫరా కారణంగా రాష్ట్రంలో దాదాపు 1.94 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా కొరత ఏర్పడిందని చెప్పుకొచ్చారు. తాజాగా జులై నెలకు నిర్దేశిరచిన సప్లై ప్లాన్ ప్రకారం రాష్ట్రానికి 1.60 లక్షల మెట్రిక్ టన్నులు రావాల్సి ఉందన్నారు. కానీ అందులో 60 శాతం ఇంపోర్టెడ్ యూరియాను కేటాయించటం ఆందోళన కలిగిస్తోందని లేఖలో పేర్కొన్నారు. దిగుమతుల ద్వారా రాష్ట్రానికి రావాల్సిన యూరియా సకాలంలో రాష్ట్రానికి చేరుకునే పరిస్థితి లేదని, ఇప్పటి వరకు ఆ యూరియాను రవాణా చేసేందుకు అవసరమైన నౌకల కేటాయింపు జరగలేదని లెటర్‌లో ప్రస్తావించారు. దీంతో ఖరీఫ్‌పంటలకు అనువైన సమయంలో యూరియా కొరత రైతులను ఆందోళనకు గురి చేస్తోందని మంత్రి తుమ్మల కేంద్రం దృష్టికి తీసుకెళ్లారు. యూరియా సరఫరాపై కేంద్రం తక్షణమే చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. జులై నెలకు కేటాయించిన 0.97 లక్షల మెట్రిక్ టన్నుల ఇంపోర్టెడ్ యూరియాకు నౌకలను కేటాయించాలని కోరారు. ఆర్ఎఫ్‌సీఎల్ నుంచి తెలంగాణకు స్వదేశీ యూరియా సరఫరాను 30,800 టన్నుల నుంచి 60,000 టన్నులకు పెంచాలని వినతి చేశారు. ఏప్రిల్ నుంచి జూన్ వరకు తలెత్తిన యూరియా లోటును భర్తీ చేయడానికి అదనపు కోటాను కేటాయించాలని మంత్రి తుమ్మల నాగేశ్వర రావు లేఖలో కోరారు.

# శంషాబాద్‌లో వర్షాలతో మేఘావృతం

### విమానాలకు ప్రతికూల వాతావరణం

**హైదరాబాద్,జులై2(వార్త వేదిక సూర్య):** రాష్ట్ర రాజధాని హైదరాబాద్ నగరంతో పాటు శివారు ప్రాంతాల్లో నిన్న సాయంత్రం నుంచి కుండపోత వర్షం కురుస్తోన్న సంగతి తెలిసిందే. మంగళవారం అర్ధరాత్రి ప్రతికూల వాతావరణం ఏర్పడడం కారణంగా.. శంషాబాద్ ఎయిర్‌పోర్టులో విమానాల ల్యాండింగ్‌కు అధికారులు అనుమతివ్వలేదు. దీంతో కొన్ని విమానాలు బెంగళూరు, విజయవాడ వైపు మళ్లించారు. లక్నో, కోల్‌కతా, ముంబై, జైపూర్ నుంచి వచ్చే విమానాలను బెంగళూరు ఎయిర్‌పోర్టుకు మళ్లించారు.






## ఎమ్మెల్యే సుధీర్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలసిన బైరామల్ గూడ బస్తీవాసులు

**ఎల్ బి నగర్, జూలై 02(వార్త వేదిక సూర్య):** బుధవారం బైరామల్ గూడ చెరువు ప్రక్కన నివాసం ఉంటున్న పలువురు ఎల్.బి.నగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి గారిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దాదాపు 30 నుంచి 40 సంవత్సరాలుగా మేము అక్కడ నివాసం ఉంటున్న నేపథ్యంలో మా యొక్క నివాసాలు తీసివేయలని అధికారులు తెలిసిన నేపథ్యంలో మేము మీ దగ్గరకు రావడం జరిగింది. అనంతరం సుధీర్ రెడ్డి మాట్లాడుతూ మీ నివాసాల ముందు ఇంతకుముందే బాక్స్ డ్రైన్స్ కట్టడం జరిగింది అని, ఎవరు ఎలాంటి ఆందోళనకు గురికోవొద్దు అని, నిర్భయంగా ఉండండి అని హామీ ఇచ్చారు. ఏ ఒక్క నివాసాలు తొలగించకుండా అధికారులతో మాట్లాడి ఎవరికి నష్టం రాకుండా చూసుకునే బాధ్యత తనదని సుధీర్ రెడ్డి తెలిపారు. దానికి బస్తివాసులు సంతోషం వ్యక్తం చేశారు.

## బీఎస్పీ ప్రధాన కార్యదర్శిగా శ్రీనివాస్

**ఎల్ బి నగర్, జూలై 02(వార్త వేదిక సూర్య):** బహుజన్ సమాజ్ పార్టీ ఎల్బీనగర్ నియోజకవర్గం ప్రధాన కార్యదర్శిగా జర్పీ శ్రీనివాస్ కురుమ, కార్యదర్శిగా మొలకలపల్లి కుమార్ లు నియమకమయ్యారు. ఈ మేరకు బుధవారం నియోజకవర్గం అధ్యక్షులు సంపత్ వేముగంటి, రాష్ట్ర ప్రధాన



కార్యదర్శి గుండెల ధర్మేందర్, రంగారెడ్డి జిల్లా ఇన్చార్జ్ బండారి రవికుమార్ ముదిరాజ్, జిల్లా బివిఎఫ్ కన్వీనర్ దాసరి వినయ్, ఎల్బీనగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్చార్జిలు మంత్రి జగన్, గువ్వల సాయిరామకృష్ణ ముదిరాజు చేతుల మీదుగా నియామక పత్రం వారికీ అందించారు.

## కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులు ప్రారంభం

**ఎల్ బి నగర్, జూలై 02( వార్త వేదిక సూర్య):** కొత్తపేట డివిజన్ శ్రీ శంకర్ కాలనీలో రూ. 25 లక్షలతో చేపట్టే అసోసియేషన్ కమ్యూనిటీ హాల్ నిర్మాణం పనులను స్థానిక కాలనీ అసోసియేషన్ సభ్యులతో కలిసి



కార్పొరేటర్ నాయికోటి పవన్ కుమార్ బుధవారం ప్రారంభించారు. నిర్మాణం పనులు నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఏఈ షరీఫ్, వర్క్ ఇన్స్పెక్టర్ వెంకటేశ్వర్లు కాలనీ అధ్యక్షుడు క్రిష్ణ, రమేష్ చారి, విద్యసాగర్, నాగేశ్వర్ రావు, రమేష్, భాస్కర్, సంగీత, తదితరులు పాల్గొన్నారు.

## బిజెపి ఆధ్వర్యంలో ఆషాడ గోరింటాకు పండగ

**ఎల్ బి నగర్, జూలై 02 (వార్త వేదిక సూర్య):** బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా కౌన్సిల్ మెంబర్ కాటా విజయ గౌడ్ ఆధ్వర్యంలో బుధవారం ఆషాఢ మాసం సందర్భంగా గోరింటాకు పండుగ కార్యక్రమం కొత్తపేట కార్పొరేటర్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. భారతీయ జనతా పార్టీ మహిళా మోర్చా నాయకులు పెద్ద ఎత్తున పాల్గొని సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మహిళ నాయకులు కొప్పెర శ్యామల, నూకల పద్మ రెడ్డి, పోరెడ్డి కవిత రెడ్డి, రాజేశ్వరి, రజిత, కొత్తపేట డివిజన్ బీజేపీ మహిళా నాయకులు వైజయంతి, లావణ్య, సంగీత, అరుణ, లావణ్య, తదితరులు పాల్గొన్నారు.









# ప్రజా సమస్యల పరిష్కారమే మా ధ్యేయం

### - నియోజకవర్గ ఇంచార్జ్, డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి

**మైలర్‌దేవ్‌పల్లి, 02జులై (వార్త వేదిక సూర్య):** రాజేంద్రనగర్ నియోజకవర్గంలోని మైలర్ దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని ఆర్ జి కే పింక్ క్వార్టర్ ప్రాంతంలో మంచినీటి సమస్యలు ఎదుర్కొంటున్న స్థానికుల విజ్ఞప్తి మేరకు బుధవారం నియోజకవర్గ ఇంచార్జ్, డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి ప్రత్యక్షంగా పర్యటించారు. బస్తీలో పలు సంవత్సరాలుగా మంచినీరు సరఫరాలో అంతరాయాలు ఏర్పడి, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయాన్ని పరిగణలోకి తీసుకుని, కొత్త వాటర్ పైప్‌లైన్‌ను మంజూరు చేయించారు. పై అపార్ట్‌మెంట్‌లకు కూడా నీటి సరఫరా సజావుగా కొనసాగేలా అధికారులతో కలిసి పర్యవేక్షణ చేపట్టారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ... ప్రజలకు మంచి నీటి సమస్య పూర్తిగా పరిష్కారమయ్యే వరకు మా కృషి కొనసాగుతుంది. హౌసింగ్ బోర్డు సొసైటీకి సంబంధించి అధికారులతో మళ్లీ చర్చించి, స్థిరమైన పరిష్కారం తీసుకురావడమే నా ధ్యేయం, అని తెలిపారు. అలాగే, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులను ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మాజీ వార్డ్ మెంబర్ అడికే జనార్ధన్, తలారి చిన్న, బబ్లూ, మోహన్ రెడ్డి, అంజమ్మ, అడికే శివ, రాజేష్, సచిన్, శంకర్ రెడ్డి, హెచ్ఎండబ్ల్యుఎస్అండ్ఎస్‌బి డీజీఎం రేణుక, జిహెచ్ఎంసి వర్క్ ఇన్స్పెక్టర్ భాను తదితరులు పాల్గొన్నారు.

# గ్రూప్-2 మరియు గ్రూప్-3 నియామకాల్లో అవకతవకలపై దాసరి ఉష ఆందోళన

### మాజీ హోంమంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డితో భేటీ

**మైలర్‌దేవ్‌పల్లి,02జులై (వార్త వేదిక సూర్య):** పెద్దపల్లి నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసిన దాసరి ఉష, రాష్ట్రంలోని గ్రూప్-2, గ్రూప్-3 ప్రభుత్వ నియామకాల్లో మహిళల హక్కులకు భంగం కలిగించే అవకతవకలపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో ఆమె బుధవారం మాజీ హోంమంత్రి మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి వారి నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసి, ఈ విషయంపై ప్రత్యేకంగా చర్చించారు. ఈ



సందర్భంగా దాసరి ఉష మాట్లాడుతూ... రాష్ట్ర మహిళలకు సమాన అవకాశాలు కల్పించాల్సిన నియామక ప్రక్రియలో పారదర్శకత లోపించింది. నియామకాల్లో జరిగిన తేడాలపై సమగ్ర విచారణ జరిపించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలి అని అన్నారు. మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి ఈ అంశాన్ని తీవ్రంగా పరిగణించి, సంబంధిత అధికారులతో మాట్లాడి అవసరమైన చర్యలు తీసుకునేందుకు తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో మైలార్ దేవ్ పల్లి డివిజన్ అధ్యక్షులు ఎస్. వెంకటేష్, కొంపల్లి జగదీష్ నేత, యాదగిరి భాస్కర్ నేత, మల్లేష్ నేత తదితరులు పాల్గొన్నారు.

## రాంచరణ్ ఆయిల్ మిల్ రోడ్డులో

# ఓపెన్ మ్యాన్‌హోల్

### పరిష్కారం కోరుతున్న స్థానికులు!

**మైలర్‌దేవ్‌పల్లి,02జులై (వార్త వేదిక సూర్య):** రాజేంద్రనగర్ సర్కిల్, మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని ఓల్డ్ కర్నూల్ రోడ్డులో ఉన్న రాంచరణ్ ఆయిల్ మిల్ ప్రధాన రహదారి వద్ద డ్రైనేజీ మ్యాన్‌హోల్ మూత లేకపోవడం, చెత్తతో నిండిపోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ సమస్యపై అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందన లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రమాదాలు జరగకుండా ప్రయాణికులే తాత్కాలికంగా ఒక కర్రను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మ్యాన్‌హోల్ పూర్తిగా చెత్తా చెదారంతో మూసుకుపోవడం వల్ల డ్రైనేజీ నీరు పొంగిపొర్లుతోందని, దీంతో పరిసరాలు అపరిశుభ్రంగా మారుతున్నాయని, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ఈ సమస్యను సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు గుర్తించి త్వరగా పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు. తక్షణమే మ్యాన్‌హోల్‌కు మూత ఏర్పాటు చేసి, చెత్తను తొలగించి, డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచాలని డిమాండ్ చేస్తున్నారు. లేనిపక్షంలో పెద్ద ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు.



# కంట్రోల్ రూమ్ ఏర్పాటుతో బాధిత కుటుంబీకులకు సమాచారం

### - డీఆర్వో పద్మజ రాణి

**సంగారెడ్డి, జూలై 2 (వార్త వేదిక సూర్య):** ఇస్నాపూర్ మండలం పాశ మైలారం పారిశ్రామికవాడలోని సిగాచి ఫార్మా పరిశ్రమలో జరిగిన అగ్ని ప్రమాదం బాధితులకు రక్షణ సహాయ చర్యలు అందించేందుకు ప్రత్యేక కంట్రోల్ రూమ్ సంగారెడ్డి కలెక్టరేట్ లో ఏర్పాటు చేయగా.. క్షతగాత్రుల వివరాలు కుటుంబీకులకు తెలిపినట్లు జిల్లా రెవెన్యూఅధికారిణి పద్మజ రాణి తెలిపారు. ప్రమాద బాధితుల వివరాలు తెలుసుకునేందుకు ఈనెల 1వ తేదీ మంగళవారం 26 ఫోన్ కాల్స్, రెండవ తారీకు (నేడు )బుధవారం 30 వరకు ఫోన్ కాల్స్ వచ్చాయని, వాటికి స్పందించి క్షతగాత్రుల వివరాలను సంబంధితులకు అందించామని తెలిపారు. బాధితుల కుటుంబ సభ్యులు లేదా ఇతరులు తక్షణ సమాచారం కోసం 08455-276155 నంబర్‌ను సంప్రదించాలని ఆమె విజ్ఞప్తి చేశారు.



# ఎంపీని పరామర్శించిన నాయకులు

**సంగారెడ్డి, జూలై 2 (వార్త వేదిక సూర్య):** మెదక్ ఎంపీ మాధవనేని రాఘవ నందన్ రావు కాలికి శస్త్ర చికిత్స చేయించుకుని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. గుమ్మడిదల మున్సిపాలిటీకి చెందిన మైత్రి ఫౌండేషన్ చైర్మన్ బీజేపీ నాయకులు, చెన్నం చెట్టి ఉదయ్ కుమార్ ఎంపీని పరామర్శించారు. ఈ కార్యక్రమంలో యువమోర్చా నాయకుడు పంచలింగాల శ్రావంత్ రెడ్డి పాల్గొన్నారు.





# ప్రజల ఆరోగ్యమే లక్ష్యం

### మార్కండేయ నగర్‌లో గురువారం ఉచిత వైద్య శిబిరం

### వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు విడెం రమేష్

**మైలర్‌దేవ్‌పల్లి,02జులై (వార్త వేదిక సూర్య):** రాజేంద్రనగర్ సర్కిల్, మైలర్‌దేవ్‌పల్లి డివిజన్‌లోని మార్కండేయ నగర్ ప్రజల ఆరోగ్య రక్షణ కోసం ఈనెల 3వ తేదీ గురువారం ఉదయం 9 గంటల నుండి స్థానిక బస్తీ దవాఖానలో ఇంటిగ్రేటెడ్ మెగా హెల్త్ క్యాంప్ నిర్వహించనున్నారు. ఈ ఆరోగ్య శిబిరాన్ని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్నట్లు వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు విడెం రమేష్ తెలిపారు. శిబిరంలో చెస్ట్ ఎక్స్‌రే, హెచ్ఐవీ స్క్రీనింగ్, బీపీ, షుగర్ టెస్టులు, చిన్నపిల్లల్లో టీబీ నివారణ ఇంజెక్షన్లు వంటి అనేక ముఖ్యమైన వైద్య పరీక్షలు ఉచితంగా అందుబాటులో ఉంటాయన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకొని తమ కుటుంబ సభ్యులతో కలిసి పాల్గొనాలని బస్తీ కమిటీ అధ్యక్షులు విడెం రమేష్, ప్రధాన కార్యదర్శి కోట శ్యాంకుమార్, మెడికల్ అండ్ హెల్త్ సూపర్వైజర్ రహీం కోరారు.

## మై ఆటో ఈజ్ సేఫ్ రిజిస్ట్రేషన్ డ్రైవ్

### 80 మంది ఆటో డ్రైవర్ల భాగస్వామ్యం

**మైలర్‌దేవ్‌పల్లి,02జులై (వార్త వేదిక సూర్య):** రాజేంద్రనగర్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలోని అరంఘర్ చౌరస్తాలో "మై ఆటో ఈజ్ సేఫ్" రిజిస్ట్రేషన్ కార్యక్రమం నిర్వహించారు. రంగారెడ్డి జిల్లా ఏఐటీయూసీ కార్యదర్శి వనంపల్లి జైపాల్ రెడ్డి సమక్షంలో కాటేదాన్, శ్రీరామ్ కాలనీ, బుద్వేల్ స్టేషన్ ఆటో డ్రైవర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ రిజిస్ట్రేషన్ డ్రైవ్‌లో బుధవారం సుమారు



80 మంది ఆటో డ్రైవర్లు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఆటో యజమానులు, డ్రైవర్లు అందరూ ఈ యాప్‌ను తప్పనిసరిగా రిజిస్టర్ చేసుకోవాలని నిర్వాహకులు కోరారు. ప్రయాణికుల భద్రత, ఆటో డ్రైవర్ల వివరాలను సులభంగా తెలుసుకునేందుకు ఈ " మై ఆటో ఈజ్ సేఫ్" యాప్ ఎంతగానో ఉపయోగపడుతుందని వారు తెలిపారు.

## ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో అన్నదానం

### సాహితీ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ రాము

**సంగారెడ్డి, జూలై 2 (వార్త వేదిక సూర్య):** సంగారెడ్డి జిల్లా ప్రభుత్వ హాస్పిటల్ ఆవరణలో బుధవారం అయ్యప్ప స్వామిని పురస్కరించుకొని సాహితీ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ రాము ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హాస్పటల్ సిబ్బంది పాల్గొన్నారు.



# భారత రాజ్యాంగం పుస్తకావిష్కరణ




**భూదాన్ పోచంపల్లి, జూలై 2 (వార్త వేదిక సూర్య):**
పట్టణ కేంద్రంలోని పోచంపల్లి కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ ( కొంగరి భాస్కర్ ఆడిటోరియం)లో నిజాం కళాశాల ప్రొఫెసర్ తడక యాదగిరి సంక్షిప్తంగా రూపొందించిన భారత రాజ్యాంగం పుస్తకాన్ని తెలంగాణ రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ ఎండి రియాజ్ బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాంఘిక ఆర్థిక రాజకీయ రంగాల్లో సమానత్వం చేకూరాలని అన్నారు. జాతీయ సమైక్యతను సంరక్షిస్తూ సౌభ్రాతత్వాన్ని పెంపొందించాలని, ప్రతి ఒక్కరి సమానత్వం కొరకు రాజ్యాంగం రూపొందించడం జరిగిందని పేర్కొన్నారు. ప్రజలు మాత్రమే సర్వాధికారులని, ప్రభుత్వం ప్రజలకు సేవ చేయడానికి ఉంటుందని పేర్కొన్నారు. ప్రజలను చైతన్యవంతులు చేయడానికి భారత రాజ్యాంగాన్ని సంక్షిప్తంగా అనువాదం చేశారని . మన రాజ్యాంగ స్ఫూర్తిని దశ దిశ ల వ్యాప్తి చేసేందుకు ఇంటింటా రాజ్యాంగ కార్యక్రమాన్ని ఈ సంవత్సరమంతా నిర్వహించాలని అన్నారు. 600 పుస్తకాలను అందిస్తే రాష్ట్రవ్యాప్తంగా అన్ని గ్రంథాలయాల్లో ఏర్పాటు చేస్తానని తెలిపారు . భారత రాజ్యాంగం పుస్తకాన్ని సంక్షిప్తంగా రూపొందించడం పట్ల తడక యాదగిరి అభినందించారు.

పదవ తరగతిలో పోచంపల్లి మండల టాపర్గా కృష్ణవేణి టాలెంట్ స్కూల్ నిరుపేద విద్యార్థి బొమ్మ జతిన్ కు 30 వేల రూపాయల చెక్కును తడక రమేష్ అందజేశారు. త్వరలో మరో 30000 రూపాయలను అందజేస్తాన ని ప్రకటించారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర చేనేత నాయకులు తడక వెంకటేష్, పోచంపల్లి బ్యాంక్ చైర్మన్ తడక రమేష్, వైస్ చైర్మన్ భారత రాజేంద్రప్రసాద్ ,నిజాం కళాశాల ప్రొఫెసర్ తడక యాదగిరి, బ్యాంక్ సీఈవో సీత శ్రీనివాస్, రాష్ట్ర నాయకులు రాపో లు జ్ఞానేశ్వర్, బ్యాంక్ డైరెక్టర్లు ఏలే హరి శంకర్ , రాపో లు వేణు, మక్తల నరసింహ, కొండమడుగు ఎల్ల స్వామి, చేనేత కార్మిక సంఘం అధ్యక్షుడు అంకం పాండు , రాష్ట్ర చేనేత జన సమాఖ్య అధ్యక్షుడు చింతకింది రమేష్, నాయకులు గుని గంటి రమేష్ గౌడ్, భోగ విష్ణు, అంకం మురళి, ఏలే బిక్షపతి, కర్నాటి పురుషోత్తం, రాపోలు శ్రీను, పాలాది యాదగిరి , భారత భూషణ్, బొమ్మ హరిశంకర్ , మెరుగు శశికళ, వ లందాస్ ప్రవీణ్, భోగ నరసింహ, తదితరులు పాల్గొన్నారు.





# నిర్ణీత సమయంలో ఇందిరమ్మ ఇండ్ల పనులను పూర్తి చేయాలి

**- కలెక్టర్ ఎం.హనుమంతరావు**

**యాదాద్రి భువనగిరి, జూలై 2 (వార్త వేదిక సూర్య):**
వాన కాలం సమీపిస్తున్నందున నిర్ణీత సమయంలో ఇందిరమ్మ ఇండ్ల పనులు త్వరగా పూర్తి చేసుకోవాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు అన్నారు. బుధవారం రామన్నపేట మండలంలోని ఉత్తటూర్ గ్రామంలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇండ్ల పనులను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ లబ్ధిదారులతో మాట్లాడుతూ పురోగతిలో ఉన్న ఇంది రమ్మ ఇండ్ల పనులు త్వరగా పూర్తి చేసుకోవాలన్నారు. ప్రభుత్వం ఇచ్చిన నిర్ణిత సమయంలో ఇందిరమ్మ ఇళ్ల పనులు పూర్తి చేసినం దుకు లబ్ధిదారులను కలెక్టర్ ఈ సందర్భంగా సన్మానించారు. వర్షాలు పడుతున్నందున ఇండ్ల నిర్మాణం పనులు త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. ఇండ్లకు అవసరమైన మెటీరియల్ ను తెచ్చుకోవడానికి డబ్బులు లేకపోతే మహిళా సంఘాల ద్వారా లోన్ ఇప్పించి పనులు త్వరగా పూర్తి అయ్యేలా చూడాలని సంబంధిత అధికారులను కోరారు.ఎంత తొందరగా ఇండ్ల నిర్మాణాలు పూర్తి చేసుకుంటుంటే ప్రభుత్వం ప్రతి సోమవారం మీ ఖాతాలో ఇందిరమ్మ ఇండ్ల డబ్బులు జమ చేస్తుందన్నారు. అనంతరం రామన్నపేట మండలం కేంద్రంలో ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులైన కళ్ళెం. బిచ్చవమ్మ కు జిల్లా కలెక్టర్ ఇచ్చిన హామీ ప్రకారం లో బాగంగా ఈ రోజు ఆమె ఇంటి నిర్మాణాన్ని పరిశీలించి రూ.10,000/- ఆర్థిక సహాయం అందజేశారు. జిల్లా కలెక్టర్ వెంట ఎమ్మార్వో





శాస్త్రీ, ఎం.పి.డి.ఓ యాకుబ్ , సంబంధిత అధికారులుఉన్నారు.

# పరిమళించిన మానవత్వం..

### మతిస్థిమితం కోల్పోయి దారి తప్పిన ఓ వృద్ధునికి దారి చూపించిన కానిస్టేబుల్ రామనర్సయ్యను అభినందిస్తున్న మోత్కూరు మున్సిపాలిటీ ప్రజలు

**మోత్కూరు, జూలై 2 (వార్త వేదిక సూర్య):**
గత కొన్ని రోజులుగా సుమారు 70 ఏళ్ల వయస్సు పైబడి మతస్థిమితం కోల్పోయిన ఓ వ్యక్తి మోత్కూరు మున్సిపల్ పరిధిలో రోడ్డుపై తిరుగుతూ జీవనాన్ని నెట్టుకుంటున్న ఘటన బుధవారం నాడు కనిపించడంతో మోత్కూరు పోలీస్ స్టేషన్ లో పనిచేస్తున్న కానిస్టేబుల్ మానవత్వాన్ని చాటుకున్నారు. ఈ వృద్ధుడు బట్టలు సక్రమంగా లేకుండా మున్సిపల్ పరిధిలో తిరుగుతూ కనిపించడంతో ఆ కానిస్టేబుల్ పొట్ట బత్తిని రామ నర్సయ్య ఆ మానవత దృష్టిలో ఉంచుకొని తన దగ్గరకీ అక్కున్న చేర్చుకున్నారు.





మొదటగా తాను అనుకున్నదే తడవుగా కొత్త బట్టలు ఆ వృద్ధుడికి ఇప్పించి కడుపునిండా అన్నం పెట్టి ఆకలి తీర్చాడు. అనంతరం తన వివరాలు కనుకోవడానికి శతవిధాలుగా ప్రయత్నాలు చేసి, చివరికి ఎక్కడో దారి తప్పిన ఈ వృద్ధుడిని జనగామ జిల్లా కడవెండి సీతారాంపురంలో ఉన్నా వృద్ధాశ్రమంలో స్వయంగా చేర్పించి వృద్ధుడుపై మమకారం చూపిన కానిస్టేబుల్ రామ నర్సయ్య" ను మోత్కూరు మున్సిపాలిటీ ప్రజలు అభినందిస్తున్నారు.




## పెండింగ్‌లో స్కాలర్షిప్, ఫీజు రియింబర్స్మెంట్
# తక్షణమే విడుదల చేయాలి

**భువనగిరి, జూలై 2 (వార్త వేదిక సూర్య):**(రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న పెండింగ్ స్కాలర్షిప్ ఫీజు రియం బర్స్మెంట్ విడుదల చేయాలని జూలై 2,3,4 తేదీలలో డిగ్రీ, పీజీ, ఇంజనీరింగ్ కళాశాల బంద్ జరుపుతూ యాదాద్రి జిల్లా కొలనుపాకలో పి.డి.ఎస్.యూ. ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేశారు. పి.డి.ఎస్.యూ. రాష్ట కమిటీ ఇచ్చిన పిలుపులో భాగంగా డిగ్రీ కాలేజీల బంద్ అనంతరం పి.డి.ఎస్.యూ. పి వై ఎల్ రాష్ట్ర సహాయ కార్యదర్శి బేజాడి కుమార్, జిల్లా అధ్యక్షులు మామిడాల ప్రవీణ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న 7200 కోట్ల స్కాలర్షిప్ ఫీజు ఎంబ ర్స్మెంట్స్ రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలని ఫీజు రియంబర్స్మెంట్ రాక పేద విద్యార్థులు విద్యకు దూరమైతు న్నారని అంతేగాక డిగ్రీ, పీజీ చదువుకున్న విద్యార్థులు పై తరగతికి వెళ్లాలంటే ఇటు ప్రభుత్వ యజమాన్యం అటు ప్రైవేటు యజమాన్యం విద్యార్థుల సర్టిఫికెట్లు ఇవ్వకుండా ఫీజు మొత్తం కట్టించుకుని ఇస్తున్నారని ఇందువల్ల ఫీజు కట్టలేని పేద విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారని, రాను రాను ప్రభుత్వాలు స్కాలర్షిప్ ఫీజు రియంబర్స్మెంట్ పథకాన్ని ఎత్తివేయాలని చూస్తున్నాయని అందులోని భాగం గానే రాష్ట్ర ప్రభుత్వం అటు కేంద్ర ప్రభుత్వం యూని వర్సిటీలను ప్రభుత్వ విద్యా వ్యవస్థను భ్రష్టు పట్టించే విధంగా పాలన కొనసాగిస్తుందని పేద విద్యార్థులకు విద్యను దూరం చేయాలని లక్ష్యంతో పాలకవర్గాలు ఈరోజు స్కాలర్షిప్ ఫీజు రియంబర్స్మెంట్ విడుదల చేయడం లేదని తక్షణమే స్కాలర్షిప్ ఫీజు రియంబర్స్మెంట్ విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ లేదంటే పెద్ద ఎత్తున ఉద్యమాలను ఉధృతం చేస్తామని ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని హెచ్చరిస్తున్నాం అని అన్నారు. ఈ కార్యక్రమంలో మధు, మహేష్, మామిడాల మధు, కోలా క్రాంతి, గడ్డం కార్తీక్, ఉదయ్, భాను చందర్, పాకాల నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు నోట్ బుక్స్‌ల పంపిణీ

**భూదాన్ పోచంపల్లి, జూలై 2 (వార్త వేదిక సూర్య):**
పట్టణ కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో టిఆర్ యువసేన ఆధ్వర్యంన పోచంపల్లి బ్యాంక్ చైర్మన్ తడక రమేష్ పదవ తరగతి విద్యార్థులకు నోట్ బుక్ లను బుధవారం పంపిణీ చేశారు . ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఇష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలను సాధించాలని, పాఠశాలకు తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. సేవా కార్యక్రమాలు చేపడుతున్న తడక రమేష్ ను పలువురు అభినందించారు . తడక రమేష్ జన్మదిన సందర్భంగా కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం ఆయనను శాలువాతో ఘనంగా




సత్కరించారు.

ఈ కార్యక్రమంలో పోచంపల్లి బ్యాంక్ వైస్ చైర్మన్ భారత రాజేంద్రప్రసాద్ ,పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజరెడ్డి , టిఆర్ఎస్ యువసేన అధ్యక్షుడు వల్లందాస్ ప్రవీణ్ , నాయకులు పాలాది యాదగిరి, గునిగంటి వెంకటేష్, కీర్తి సంజీవ, భోగ నరసింహ, ఆటిపాముల నాగేష్ , కూరపాటి బాబు,జింకల జయసూర్య, జోగు శ్రీనివాస్, రామచంద్రం, కల్వకుంట రమేష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.






# కాల్వపల్లి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ నూతన కమిటీ ఎన్నిక

**ఆత్మకూరు (ఎం), జూలై 02 (వార్త వేదిక సూర్య):** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు (ఎం),మండలం కాల్వపల్లి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ నూతన కమిటీని ఎన్నుకోవడం జరిగింది.అధ్యక్షులుగా సుదగాని సత్యనారయణ,ఉపాధ్యక్షులుగా తుమ్మల నరేందర్ రెడ్డి,పల్సం మల్లేష్ గౌడ్,ప్రధాన కార్యదర్శిగా పల్సం కిష్టయ్య, కార్యదర్శిలుగా భీమగాని రాములు,పసునూరి సోములు,ఆవుల యాదగిరి, కోశాధికారిగా బొక్క మధు,యూత్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులుగా పెండ్లి నవీన్, ఉపాధ్యాక్షులుగా భీమగాని నరేష్,పల్సం రవికిరణ్, ప్రధాన కార్యదర్శిగా దంతూరి భాస్కర్,కార్యదర్శిగా భీమగాని వెంకటేష్,బొక్క మల్లారెడ్డి ఆవుల నరేష్,మరిపెల్లి వినయ్, కోశాధికారిగా ఆవుల మధు, ఎన్ఎస్యూఐ కమిటీ అధ్యక్షులుగా మరిపెల్లి రాము,ఉపాధ్యక్షులుగా పెండ్లి వేణు,మరిపెల్లి లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శిగా పల్సం అనిల్,కోశాధికారిగా ఆవుల మహేష్ లను ఎన్నుకున్నారు.

# మృతురాలి కుటుంబానికి ఆర్థిక సహాయం

**మోత్కూరు, జూలై 2 (వార్త వేదిక సూర్య):**
మోత్కూరు మండలం దాచారం గ్రామంలో నడిగొట్టి యాదమ్మ అనారోగ్యంతో బుధవారం నాడు మృతి చెందారు. నిరుపేద కుటుంబానికి చెందిన యాదమ్మ మృతదేహానికి అదే గ్రామానికి చెందిన సామాజిక సేవకులు కర్నె జ్యోతి, వీరేశం



పూలమాలలు వేసి, నివాళులర్పించారు.అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ఆ కుటుంబ సభ్యులకు 5000రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానికులు సూరారం నవీన్, బీమనబోయిన అయిలయ్య, మద్రి లింగయ్య, ననుబోతు నరేందర్, జాల ప్రసాద్, జినుకల నిఖిల్, జినుకల గణేష్, సాధుల వివేక్, మాటురి మత్స్య గిరి తదితరులు పాల్గొన్నారు.

# గట్టుప్పలలో కుక్కల బెడద

**గట్టుప్పల, జూలై 2 (వార్త వేదిక సూర్య):**
గట్టుప్పల మండల కేంద్రం లో కుక్కల బెడద ఎక్కువైంది మందలు మందలుగా తిరుగుతూ ప్రజల్ని ప్రయాణికుల్ని వ్యాపార వేత్తలను భయాందోళనకు గురి చేస్తు గాయపరుస్తున్నాయి. ప్రజలు తమ అవసరలకు దుకాణాలకు రావాలంటే జంకుతున్నారు. రహదారుల వెంట వెళ్లే ప్రజలని పశువుల పై కుక్కలు దాడులు చేస్తున్నాయి. ద్విచక్ర వాహనల పై వెళ్లే వారిని వెంబడిస్తుండడంతో వారు ప్రమాదల బారిన పడుతున్నారు. చిన్న పిల్లలు కూడా బయటికీ రావాలంటే భయపడుతున్నారు. అధికారులు స్పందించి వెంటనే కుక్కలను వేరే ప్రాంతంనికి తరలించాలని స్థానికులు కోరుతున్నారు.



## శ్రీ లక్ష్మి నరసింహ స్వామి వారి దేవస్థానం, యాదగిరిగుట్ట


**తేదీ : 01/07/2025, బుధవారం**

**శ్రీస్వామి వారి ఆదాయము రూ: 11,98,769/-**

**శ్రీ స్వామి వారికి 496 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు.**

| | | |
|---|---|---|
| కళ్యాణ కట్ట | - | 24,800/- |
| ప్రధాన బుకింగ్ | - | 55,200/- |
| కైంకర్యములు | - | Nill |
| సుప్రభాతం. | - | 4,500/- |
| బ్రేక్ దర్శనం. | - | 87,600/- |
| వ్రతాలు | - | 22,800/- |
| వాహన పూజలు | - | 6,400/- |
| VIP దర్శనం | - | 1,50,000/- |
| ప్రచారశాఖ | - | 8,750/- |
| పాతగుట్ట | - | 11,560/- |
| కొండపైకి వాహన ప్రవేశం | - | 2,00,000/- |
| యాదఋషి నిలయం | - | 21,050/- |
| సువర్ణ పుష్పార్చన | - | 42,000/- |
| శివాలయం | - | 5,000/- |
| శాశ్వత పూజలు | - | Nill |
| పుష్కరిణి | - | 600/- |
| ప్రసాదవిక్రయం | - | 5,24,290/- |
| లాకర్స్ | - | 100/- |
| అన్నదానం | - | 24,119/- |
| విమాన గోపురం | - | Nill |
| లీజెస్ | - | Nill |
| ఇతరములు | - | Nill |








## తడక రమేష్‌కు ఘన సన్మానం

భూధాన్ పోచంపల్లి, జూలై 2 (వార్త వేదిక సూర్య):
పట్టణ కేంద్రంలోని పోచంపల్లి అర్బన్ బ్యాంకులో బుధవారం బ్యాంక్ చైర్మన్ తడక రమేష్ జన్మదినం పురస్కరించుకుని పలువురు నాయకులు శాలువా పూల మాలలతో ఘనంగా సత్కరించారు. కేక్ కట్ చేసి స్వీట్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర చేనేత నాయకులు తడక వెంకటేష్, తడక యాదగిరి , రాపోలు జ్ఞానేశ్వర్, చేనేత జన సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు చింతకింది రమేష్, భూదాన్ పోచంపల్లి పద్మశాలి చేనేత కార్మిక సంఘం అధ్యక్షుడు అంకం పాండు , చేనేత నాయకులు అంకం మురళి, భోగ విష్ణు, గుండు శ్రీరాములు, ఏలే బిక్షపతి, రాపోలు శ్రీనివాస్, పాలాది యాదగిరి, కర్నాటి పురుషోత్తం, భారత భూషణ్, బొమ్మ హరి శంకర్ , బిట్ల గణేష్, వేణు, కటకం శ్యాంసుందర్, మెరుగు శశికళ, గుండు రాజమణి , నాయకులు గునిగంటి రమేష్, గునిగంటి వెంకటేష్, బైరు రామాంజనేయులు, కీర్తి సంజీవ, జింకల జయ సూర్య, జోగు శ్రీనివాస్ , కూరపాటి బాబు, వలందాసు ప్రవీణ్, భోగ నరసింహ, తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనుల ప్రారంభం

రామన్నపేట, జూలై 2 (వార్త వేదిక సూర్య):
నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం ఆదేశాల మేరకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరైన లబ్ధిదారుతో కలిసి బుధవారం అధికారులు ఇండ్ల నిర్మాణానికి ముగ్గు పోసి పనులు ప్రారంభించారు. రామన్నపేట మండలంలోని నీర్నెముల గ్రామానికి చెందిన లబ్ధిదారులకు ఏఈ సురేష్ ఇంటి నిర్మాణానికి ముగ్గు పోసి నిర్మాణ విధానాన్ని తెలిపారు. కార్యక్రమంలో తాజా మాజీ వార్డు సభ్యులు నోముల ప్రవీణ్ కుమార్,



నోముల ధనలక్ష్మి యాదగిరి, ఇందిరమ్మ కమిటీ సభ్యులు ఆవుల క్రాంతి,నోముల విష్ణు, సుర్వి అశోక్, గ్రామ నాయకులు ముత్యాల శివ, నోముల స్వామి,నోముల శివ, సుర్వి భాను, నోముల క్రిష్ణ, ఓర్సు తిరుమల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

## గురుకుల పాఠశాల కళాశాలలో మౌలిక సదుపాయాలు కల్పించాలి

### విద్యార్థుల రాజకీయ పార్టీ డిమాండ్

మోత్కూరు, జూలై 2 (వార్త వేదిక సూర్య):
మోత్కూరు అద్దె భవనం నడుస్తున్న ఎస్సీ బాలుర గురుకుల పాఠశాల కళాశాలలో మౌలిక సదుపాయాలు కల్పించాలని విద్యార్థుల రాజకీయ పార్టీ జిల్లా అధ్యక్షులు ఎడ్ల నరేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం నాడు గురుకుల పాఠశాల సందర్శించడానికి వచ్చిన జె.డి. విద్యా రాణిని తమ సంఘం నాయకులతో కలిసి



పాఠశాల కళాశాలలో నెలకొన్న సమస్యలను విన్నవించారు. పాఠశాలలో బాత్రుమ్, మరుగుదొడ్ల, విద్యార్థి గదులలో ఫ్యాన్ తిరగకపోవడం పది సమస్యలపై ఆమె దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం అద్దె భవనం నడుస్తున్న ఈ పాఠశా కళాశాలకు నూతన బిల్డింగ్ ను మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ మండల అధ్యక్షులు మల్లెబోయిన మహేష్, నాయకులు అన్నెపు రవి, అనిల్ తదితరులు పాల్గొన్నారు.





# కనీస వసతులు లేని గురుకుల పాఠశాల, కళాశాలలపై చర్యలు తీసుకోవాలి

### వార్త వేదిక దినపత్రిక"లో సోమవారం ప్రచురించిన వార్తకు స్పందించిన గురుకుల జోనల్ అధికారి విద్యారాణి..

### పాఠశాలను సందర్శించిన జోనల్ అధికారి

### మౌలిక కల్పించాలని ప్రిన్సిపాల్ బిల్డింగ్ ఓనర్‌లకు ఆదేశం

మోత్కూరు, జూలై 2 (వార్త వేదిక సూర్య):
మోత్కూరు మున్సిపల్ కేంద్రంలో ఉన్నటువంటి సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాలలో కనీస వసతులు లేని ఆ పాఠశాల కళాశాల యజమాన్యంపై చర్య తీసుకోవాలని "వార్తా వేదిక సూర్య " సోమవారం (జూన్ 30) ప్రచురించిన వార్త"కు ఉమ్మడి నల్లగొండ జిల్లా అధికారి (జె. డి) విద్యారాణి బుధవారం నాడు స్పందించారు. బుధవారం నాడు ఆమె పాఠశాల, కళాశాలలో అన్ని గదులను పరిశీలించారు. అదే విధంగా బాత్రూమ్, మరుగు దొడ్లు, ఇతర మౌలిక సదుపాయాలు విద్యార్థులకు సౌకర్యార్థం అందుతున్నాయా లేవా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో మైనర్ (చిన్న, చిన్న) రిపేర్లు ఉన్నాయని వాటిని తక్షణమే విద్యార్థులకు ఇబ్బందులు కాకుండా ఏర్పాటు చేయాలని బిల్డింగ్ ఓనర్ సత్యం ను పాఠశాలకు పిలిపించి ఆదేశించారు.

ఈ సందర్భంగా బిల్డింగ్ ఓనర్ సత్యం మాట్లాడుతూ తాను గత ఏడాది అన్ని గదులలో గ్రిల్స్ కిటికీలు ఏర్పాటు చేశానని కొంత మంది విద్యార్థులు వాటిని తొలగిస్తున్నారని చెప్పారు. పాఠశాలలో ప్రహరి గోడ విషయంలో తనకున్న స్థలంలో వెంటనే ఏర్పాటు చేయడానికి సుముఖంగా ఉన్నానన్నారు.

పాఠశాలను మైనర్ రిపేర్ అన్నింటిని ఈనెల 15 కల్లా పూర్తి చేస్తానని తెలిపారు. బాత్రూమ్, మరుగుదొడ్లు నీటి సమస్య విద్యార్థులకు రాకుండా చూడాలని ప్రిన్సిపాల్‌కు జోనల్ అధికారి సూచించగా గత 5రోజులు క్రితమే 2 రోజులపాటు కరెంటు సమస్య ఉండి విద్యార్థులకు నీటి సరఫరా అంతరాయం ఏర్పడిన మాట వాస్తవమేనని అయినప్పటికీ నీ సమస్య ఏర్పాటు కాకుండా చూశానని తెలిపారు. భవిష్యత్‌లో పాఠశాల, కళాశాలలో ఏలాంటి సమస్య రాకుండా చూడాలని జె.డి విధ్యారాణి ప్రిన్సిపాల్ ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆ పాఠశాల,కళాశాల ప్రిన్సిపాల్ ఐ. శారద, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# మోత్కూరు తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాల బాలురకు నూతన భవనం నిర్మించాలి

### అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏ ఐ.ఎస్.ఎఫ్)డిమాండ్

మోత్కూరు, జూలై 2 (వార్త వేదిక సూర్య):
అద్దె భవనాలలో నడుస్తున్న మోత్కూరు మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల ఎస్సీ బాలుర, పాఠశాల, కళాశాలను అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) జిల్లా ప్రధాన కార్య దర్శి ఉప్పుల శాంతి కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధ వారం నాడు ఆ సంఘం నాయకులతో కలిసి గురుకుల పాఠశాల, కళాశాలను శాంతి కుమార్ సందర్శించి మాట్లాడారు. అక్కడ ఉన్న సమస్యలను విద్యార్థుల ద్వారా తెలుసుకొని అద్దె భవనంలో ఉన్న అరకొర వసతులతో నడుస్తున్న పాఠశాలను పరిశీలించారు.

ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ గత మూడేళ్ళ నుంచి గతంలో ఉన్న ఆర్సిఓ అప్పటి ఇక్కడున్నా ఉన్న ప్రిన్సిపాల్ ఎన్నిసార్లు విన్నవించిన కూడా విద్యార్థుల పట్ల శ్రద్ధ వహించకుండా హాస్టల్లో రెండు చోట్ల నడిపిస్తున్న ఈ పాఠశాలను పరిస్థితిని మార్చలేదన్నారు. అరకొర వసతులతో ఉన్న ఈ హాస్టల్లో విద్యార్థులు త్రీవ అవస్థలు పడుతున్నారని శాంతి ఆవేదన వ్యక్తం చేశారు. పాఠశాల, కళాశా లలు ప్రారంభమై, నేటికీ నెలరోజులు కావస్తున్న గురుకులాలకు బెడ్ షీట్లు యూనిఫామ్ షూలు నోట్ బుక్స్ అందించకపోవడం అంత్యర్యం మేమిటి ప్రశ్నించారు.



ప్రభుత్వ హాస్టల్లో చదువుకునే విద్యార్థులకు ప్రభుత్వం అన్ని రకమైన మౌలిక వసతులు కల్పించాలని 10రోజుల్లో సమస్యల పరిష్కారం చేయని యెడల రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ మండల నాయకులు రాంపాక చందు సారగండ్ల శివ చిప్పల పెళ్లి నరేందర్ బన్నీ తదితరులు పాల్గొన్నారు.



# పదేళ్లు పేదోళ్ళను మోసం చేసిన కెసిఆర్

### ఇందిరమ్మ రాజ్యంలో పేదల కల నెరవేరింది : ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్

యాదాద్రి భువనగిరి, జూలై 2 (వార్త వేదిక సూర్య):
పదేళ్లు రాష్ట్రాన్ని పరిపాలించిన టిఆర్ఎస్ ప్రభుత్వం డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పేరుతో పేదోళ్లను మోసం చేసిందని రాష్ట్ర ఎస్సీ ఎస్టీ మైనార్టీ సంక్షేమ శాఖ, జిల్లా ఇన్చార్జి మంత్రి అడ్లూరి లక్ష్మణ్ ఆరోపించారు. 18 నెలల కాంగ్రెస్ ప్రభుత్వంలో ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేస్తూ పేదోళ్ల కలలను నిజం చేస్తున్న ఘనత తమ ప్రభుత్వానికి దక్కుతున్నదని మంత్రి అన్నారు. బుధవారం నాడు యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామినీ ప్రభుత్వ విప్ స్థానిక ఎమ్మెల్యే బీర్ల ఐలయ్యతో కలిసి దర్శించు కున్నారు. ఈ సందర్భంగా అర్చకులు మంత్రికి పూర్ణకుంభంతో స్వాగతం పలికి ఆశీర్వదించి స్వామివారి చిత్రపటాన్ని ప్రసాదాన్ని అంద జేశారు. అనంతరం యాదగిరిగుట్ట మండలం సైదాపురం గ్రామంలో ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారులు స్వప్న బాల మల్లేష్ దంపతుల ఇందిరమ్మ ఇంటిని మంత్రి ప్రారంభించారు. గ్రామంలో ప్రజలు డప్పు వాయిద్యాలతో ఘన స్వాగతం పలికారు. అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడుతూ నిధులు నీళ్లు నియామకాల పేరుతో తెచ్చుకున్న తెలంగాణను టిఆర్ఎస్ ప్రభుత్వం అన్ని రకా లుగా అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిందని ఆరోపించారు. గత ప్రభుత్వంలో అవినీతి అక్రమాలకు పాల్పడి అధికారులతోఫోన్ టాపింగ్‌లు చేయించిన నాయకుల గుట్టురట్టు త్వరలో అవుతుందని మంత్రి అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను



ఒక్కొక్కటిగా అమలు చేస్తూ రాష్ట్రాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభివృద్ధి పదంలో నడిపిస్తున్నారని పేర్కొన్నారు. పేద వర్గాలకు న్యాయం చేయడమే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం పనిచేస్తున్నదని అన్నారు. ప్రభుత్వ విప్పు బీర్ల ఐలయ్య మాట్లాడుతూ ఇచ్చిన హామీలలో ప్రతి ఒక్కటి అమలు చేసుకుంటూ మడమ తిప్పకుండా మాట నిలబెట్టుకుంటున్న ప్రజా ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం అని అన్నారు. సొంతింటి కలలు కన్నా పేదవాళ్లకు ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసి వారి కళ్ళను నిజం చేస్తున్నా ప్రభుత్వం తమ



ప్రభుత్వం అని పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇండ్లు మంజూరైన లబ్ధి దారులు ముందుగా ఎవరు నిర్మాణం చేసుకుంటే వారికి పట్టు వస్త్రాలతో పాటు దావత్‌కు గొర్రె పోడేలును ఇస్తానని గతంలో హామీ ఇచ్చారు. అన్న మాట ప్రకారం ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారులు స్వప్న బాల మల్లేష్ దంపతులకు పట్టు వస్త్రాలు అందజేసి గొర్రెపుడేలును మంత్రి చేతుల మీదుగా ఎమ్మెల్యే ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఎం హనుమంతరావు, అదనపు కలెక్టర్ భాస్కరరావు ఇతర అధికారులు కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## కేఎచ్ఆర్ ఫౌండేషన్ తరపున మృతురాలి కుటుంబానికి ఆర్థిక సహాయం

ఆత్మకూరు (ఎం), జూలై 02 (వార్త వేదిక సూర్య):
యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు (ఎం) మండలం ఖప్రాయపల్లి గ్రామంలో రాత్రి అనారోగ్యంతో మృతిచెందిన గూండా వీరమ్మ కుటుంబాన్ని బిఆరెస్ పార్టీ గ్రామశాఖ పరామర్శించి ఆలేరు మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత మహేందర్ రెడ్డి ఆశీస్సులుతో కేఎచ్ఆర్ ఫౌండేషన్ చైర్మన్,బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు కొప్పుల హరిదీప్ రెడ్డి సహకారంతో 5000 రూపా యలు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షులు కొంగరి మైసయ్య, బిఆరేస్వి జిల్లా కో ఆర్డినేటర్ దేవరపల్లి ప్రవీణ్ రెడ్డి,జిల్లా నాయకులు కాంభోజు భానుప్రకాష్, నియోజకవర్గ యూత్ ప్రధాన కార్యదర్శి నూనెముంతల విజయ్ కుమార్,జిల్లాల శ్రీను, ఆకిరెడ్డి శ్రవణ్, పోరెండ్ల శెట్టియ్య, కోట ఉపేందర్, దేవినేని శంకరయ్య, అన్వార్,



మారోజు రాములు, పర్నె ప్రభాకర్ రెడ్డి, గూండా సోమయ్య, గదాగాని మధు తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ పార్టీని వీడి కాంగ్రెస్ పార్టీలో చేరిన ప్యాక్స్ డైరెక్టర్

ఆత్మకూరు (ఎం), జూలై 02 (వార్త వేదిక సూర్య):
యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు మండల ప్యాక్స్ డైరెక్టర్ మల్లెల రామచందర్ ముఖ్యమంత్రి వర్యులు రేవంత్ రెడ్డి చేస్తున్న ప్రజా పాలనకు ఆకర్షితులై జిల్లా ఇంచార్జ్ మంత్రి వర్యులు అడ్లూరి లక్ష్మణ్, ప్రభుత్వ విప్, ఆలేరు శాసన సభ్యులు బీర్ల ఐలయ్య,జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు అండెం సంజీవ రెడ్డి ల సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు.

ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు విసరపు యాదగిరి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు యాస లక్ష్మారెడ్డి,గంగాపురం మల్లేశం, ప్యాక్స్ చైర్మన్ జిల్లాల శేఖర్ రెడ్డి,వర్కింగ్ ప్రెసిడెంట్ ముద్దసాని సిద్ధులు,తాజా మాజీ రాష్ట్ర సర్పంచ్ల ఫోరం ప్రధాన కార్యదర్శి బీర్ల శంకర్,తాజా మాజీ మండల సర్పంచ్ల ఫోరం అధ్యక్షులు జన్నాయికోడె నగేష్, ప్యాక్స్ డైరెక్టర్ నోముల వెంకట్ రెడ్డి,ఓబీసీ సెల్ అధ్యక్షులు బత్తిని ఉప్పలయ్య నాయకులు తండా



శ్రీశైలం,భాషబోయిన పాపయ్య,పరకాల అంజయ్య యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు చిత్తర్ల అనిల్ తదితరులు పాల్గొన్నారు.






## నూతన పట్టువస్త్రాలంకరణ కార్యక్రమములో పాల్గొన్న గుడిపల్లి మండల పార్టీ నాయకులు కసిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి

**దేవరకొండ, జూలై 2(వార్త వేదిక సూర్య):** గుడిపల్లి మండల పరిధిలోని ఘనిపల్లి గ్రామానికి చెందిన భూతం సుఖేందర్ – శోభారాణి గార్ల కుమార్తె & కుమారుడు వర్షిణి – ప్రణవ్ లను వైష్ణవి కన్వేషన్ హాల్ కోన మేకలవారిగూడెం లోని జరిగిన కార్యక్రమంలో గుడిపల్లి మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు కసిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి పాల్గొని చిన్నారులను ఆశీర్వదించారు. కార్యక్రమ ములో దేవరకొండ మార్కెట్ కమిటీ డైరెక్టర్ భూతం సైదులు గుడారి వెంకటేశ్వర్లు.భూతం కిరణ్.కమ్మంపాటి యాదయ్య.రమేష్.వినోద్. లచ్చిరాం. రామావత్ వెంకటేశ్వర్లు. పగిడిమర్రి కిరణ్ తదితరులు ఈ కార్యక్రమములో పాల్గొన్నారు.

## నూతన పట్టు వస్త్రాలంకరణ మహోత్సవములో పాల్గొని ఆశీర్వదించిన టీపీసీసీ సభ్యులు డాక్టర్ దూదిపాల వేణుధర్ రెడ్డి

**దేవరకొండ, జూలై 2(వార్త వేదిక సూర్య):**
కొండమల్లేపల్లి, మండల కేంద్రంలో గల విజయలక్ష్మి ఫంక్షన్ హాల్ లో గల నాంపల్లి మండలం దేవత్ పల్లి గ్రామానికి చెందిన ఐఎన్‌టియుసి జిల్లా జనరల్ కార్యదర్శి నారోజు



సైదా చారి గారి కుమార్తె కుమారుడు సౌమ్య & వెంకటేశ్వర చారి పట్టు వస్త్రాలంకరణ మహోత్సవ కార్యక్రమంలో పాల్గొని చిన్నారులను ఆశీర్వదించిన టిపిసిసి సభ్యులు & పిఎసిఎస్ చైర్మెన్ డాక్టర్ దూదిపాల వేణుధర్ రెడ్డి.

## తెలంగాణ నూతన బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావుని ఘనంగా సత్కరించిన చిట్యాల మున్సిపాలిటీ బిజెపి అధ్యక్షుడు గుండాల నరేష్ గౌడ్

**చిట్యాల, జూలై 2(వార్త వేదిక సూర్య):**
తెలంగాణ రాష్ట్ర హైకోర్టులో హైకోర్టు సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది బార్ కౌన్సిల్ రాష్ట్ర జాతీయ మాజీ కౌన్సిల్ మెంబర్ ఎక్స్ ఎమ్మెల్సీ ఎం.రామచంద్ర రావు బిజెపి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షునిగా ఎన్నికైన సందర్భంలో రాష్ట్ర హైకోర్టు లో సన్మాన సభ కార్యక్రమంలో పాల్గొన్న నల్గొండ న్యాయవాది బిజెపి చిట్యాల పట్టణ అధ్యక్షులు గుండాల నరేష్ గౌడ్ పాల్గొని రామచంద్ర రావు గారిని సన్మానించడం జరిగింది కార్యక్రమంలో



హైకోర్టు బార్ కౌన్సిల్ చైర్మన్ నరసింహారెడ్డి సుప్రీంకోర్టు బార్ కౌన్సిల్ మెంబర్ విష్ణువర్ధన్ రెడ్డి హైకోర్టు వైస్ చైర్మన్ సునీల్ గౌడ్ గ బిజెపి లీగల్ సెల్ రాష్ట్ర గోకుల రమణారావు హైకోర్టు సీనియర్ న్యాయవాదులు మహిళా న్యాయవాదులు జూనియర్ న్యాయవాదులు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## క్షతగాత్రులను పరామర్శించిన ఏఐసీసీ తెలంగాణ ఇన్చార్జ్ మీనాక్షి నటరాజన్

**సంగారెడ్డి, జూలై 2 (వార్త వేదిక సూర్య):**
సంగారెడ్డి జిల్లా పాశమైలారం సిగాచీ పరిశ్రమలో జరిగిన పెనువిషాద సంఘటనా స్థలాన్ని బుధవారం ఏఐసీసీ తెలంగాణ ఇంచార్జ్ మీనాక్షీ నటరాజన్, టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ సందర్శించారు. పటాన్ చెరువులోని ధ్రువ మదీనాగూడ ప్రణం ఆసుపత్రులలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను పరామర్శించి ప్రభుత్వం అన్ని విధాల అండగా ఉంటుందని తెలియజేశారు. బాధిత కుటుంబాలకు భరోసా కల్పించారు.



గాయపడిన క్షతగాత్రులను హాస్పిటల్ వెళ్లి పరామర్శించారు. సంఘటన జరిగిన వివరాలను వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనరసింహ వివరించారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, టీజీఐఐసీ చైర్మన్ నిర్మలా జగ్గారెడ్డి, మెదక్ పార్లమెంట్ ఇంచార్జ్ నీలం మధు ముదిరాజ్, చైర్మన్ ఎంఏ ఫహీం, పటాన్చెరు ఇంచార్జ్ కాట శ్రీనివాస్ గౌడ్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.





**దేవరకొండ, జూలై 2(వార్త వేదిక సూర్య):** నల్గొండ జిల్లా కలెక్టర్ కార్యాలయ సముదాయంలో ఉన్న ఉదయాదిత్య భవన్‌లో నిర్వహించిన ఉమ్మడి నల్గొండ జిల్లాలో అమలవుతున్న ప్రభుత్వ పథకాలపై నేడు నల్గొండ జిల్లా ఇంచార్జీ మంత్రి వర్యులు, రాష్ట్ర ఎస్సీ,ఎస్టీ మరియు మైనార్టీల సంక్షేమ శాఖ మంత్రి వర్యులు శ్రీ అడ్లూరి లక్ష్మణ్,నల్గొండ జిల్లా మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి గారు, కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి గారు,ఎంపీలు,ఎమ్మెల్సీలు,ఎమ్మెల్యేలు,జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి గారు,ఉమ్మడి జిల్లా అధికారులతో కలిసి సమీక్ష సమావేశంలో పాల్గొన్న దేవరకొండ శాసన సభ్యులు నేనావత్ బాలు నాయక్

# ప్రభుత్వ విద్యాలయాలలో మౌలిక వసతులు కల్పించాలి

- **విద్యాశాఖ బడ్జెట్‌ను 15 % పెంచుతామని మేనిఫెస్టో లో చెప్పి ఏడు శాతం కు పరిమితం**
- **రేవంత్ రెడ్డికి రియల్ ఎస్టేట్ మీదున్న ప్రేమ విద్యావ్యవస్థ పై లేదు**
- **ప్రభుత్వ తీరుతో ప్రైవేటు స్కూళ్ల సంఖ్య పెరుగుతోంది ప్రైవేట్ స్కూళ్ల ఫీజులపై నియంత్రణ లేదు.**
- **విద్యా సంవత్సరం మొదలైనా విద్యా శాఖ మీద రేవంత్ రెడ్డి కనీసం సమీక్ష చేయలేదు**
- **విద్యార్థుల సమస్యలపై బి. ఆర్ ఎస్ వి పక్షాన ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తాం.సమస్యలను పరిష్కరించే వరకు కూడా పోరాటం కొనసాగిస్తాం....**
- **తెలంగాణలో విద్యావ్యవస్థను కేసీఆర్ బలోపేతం చేస్తే కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోంది.**
- **ఒక్క ప్రభుత్వ పాఠశాలను అయినా ముఖ్యమంత్రి సందర్శించారా కార్పొరేట్ విద్యా సంస్థలకు కొమ్ము కాస్తున్నారు..**

**బిఆర్ఎస్వి దేవరకొండ నియోజకవర్గ అధ్యక్షులు బొడ్డుపల్లి కృష్ణ**

**దేవరకొండ, జూలై 2(వార్తవేదికసూర్య):** ప్రభుత్వ విద్యాలయాలలో మౌలిక వసతులు కల్పించాలని అని బిఆర్ఎస్వి దేవరకొండ నియోజకవర్గ అధ్యక్షులు బొడ్డుపల్లి కృష్ణ ప్రభుత్వాని డిమాండ్ చేశారు. బుధవారం బిఆర్ఎస్వి బడిబాట బి.ఆర్.ఎస్.వి రాష్ట్ర కమిటీ పిలుపు మెరకు బిఆర్ఎస్వి దేవరకొండ నియోజకవర్గ అధ్యక్షులు బొడ్డుపల్లి కృష్ణ అధ్వర్యంలో బి ఆర్ ఎస్ వి 'బడి బాట' కార్యక్రమం నిర్వహించడం జరిగింది. దేవరకొండ మోడల్ స్కూల్ సందర్శించి విద్యార్థుల సమస్యలు తెలుసుకోవడం జరిగింది. ఈ



సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యాశాఖ బడ్జెట్ ను 15 % పెంచుతామని మేనిఫెస్టో లో చెప్పి ఏడు శాతంకు పరిమితం చేశారు అని ఆయన అన్నారు.రేవంత్ రెడ్డికి రియల్ ఎస్టేట్ మీదున్న ప్రేమ విద్యావ్యవస్థపై లేదు అని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వ తీరుతో ప్రైవేటు స్కూళ్ల సంఖ్య పెరుగుతోంది ప్రైవేట్ స్కూళ్ల ఫీజుల పై నియంత్రణ లేదు.విద్యా సంవత్సరం మొదలైనా విద్యా శాఖ మీద రేవంత్ రెడ్డి కనీసం సమీక్ష చేయలేదు అని ఆయన అన్నారు.విద్యార్థుల సమస్యలపై బి.ఆర్.ఎస్.వి పక్షాన ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తాం.సమస్యలను పరిష్కరించే వరకు కూడా పోరాటం కొనసాగిస్తాం అని ఆయన అన్నారు.తెలంగాణలో




విద్యావ్యవస్థను కేసీఆర్ బలోపేతం చేస్తే కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోంది అని ఆయన అన్నారు. ఒక్క ప్రభుత్వ పాఠశాలను అయినా ముఖ్యమంత్రి సందర్శించారా కార్పొరేట్ విద్యా సంస్థలకు కొమ్ము కాస్తున్నారు ఇప్పటివరకు దాదాపు 70 శాతం మంది విద్యార్థులకు పుస్తకాలు, యూనిఫాంలు అందలేదని విద్యార్థులు తేలిపారు. ప్రభుత్వం వెంటనే పుస్తకాలు, యూనిఫాంలు అంధచేయాలని, ఆహారం పరిశుభ్రంగా పెట్టలని డిమాండ్ చేసారు ఈ కార్యక్రమములో బిఆర్ఎస్వీ మండల అధ్యక్షులు పాత్లవాత్ లక్ష్మణ్, పంది హరికృష్ణ, కావటి వెంకటేష్, మహేష్, హరి, శ్రీను,తదితరులు పాల్గొన్నారు.

# సిగాచి పరిశ్రమలో రెస్క్యూ ఆపరేషన్, కొనసాగుతున్న సహాయక చర్యలు

**- జిల్లా కలెక్టర్ పి ప్రావీణ్య**

**సంగారెడ్డి వార్త వేదిక సూర్య :**
ప్రమాదం జరిగినప్పటి జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య, జిల్లా ఎస్పీ పరతోష్ పంకజ్ కు చేరుకొని సహాయక చర్యలను స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. ఘటనా స్థలాన్ని వారు తరచూ సందర్శించి సహాయక బృందాలకు మార్గదర్శనం చేస్తున్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పి ప్రావీణ్య మాట్లాడుతూ బాధిత కుటుంబాలకు కార్యాలయంలో ప్రత్యేక సహాయక కేంద్రం ఏర్పాటు చేసామన్నారు. వారి కుటుంబ సభ్యులకు భోజనం, తాత్కాలిక నివాసం, రవాణా వంటి సౌకర్యాలు ఏర్పాటు చేశామన్నారు.

బాధిత కుటుంబాలకు కౌన్సిలింగ్ ఇవ్వడం జరుగుతుం దన్నారు. బాధితులు వారి వారి స్వగ్రామాలకు వెళ్లేందుకు అవ సరమైన రవాణా ఏర్పాట్లు చేసామన్నారు. ఒడిశా, బీహార్ రాష్ట్రాల అధికారులు కూడా సహాయక చర్యలు అందిస్తున్నారు . సిగాచి ఫార్మా పరిశ్రమ ప్రమాద తాజా పరిస్థితులను కలెక్టర్ వివరించారు. సిగాచి పరిశ్రమ అధికారికంగా అందిన వివరాల ప్రకారం వివ ంంంరాలు ఈ విధంగా అందించారు.మొత్తం 143 మంది ఉద్యోగులు వివరాలుఅందించారు.సురక్షితంగా ఉన్నవారు 60, గాయపడి చికిత్స పొందుతున్నవారు 35,గుర్తించబడిన మృతుల సంఖ్య 18, గుర్తించలేని మృతదేహాలు 20, గల్లంతైనవారు 10, మంది ఉన్నారు.కుటుంబాలకు అప్పగించిన మృతదేహాలు 18,



ప్రయోగశాలలో DNA ఫలితాల కోసం పెండింగ్‌లో 18 నమూనాలు ఉన్నాయి.ఇంకా సేకరించాల్సిన మృతదేహాల నమూనాలు 2,

పరీక్షించాల్సిన కుటుంబ సభ్యుల రక్త నమూనాలు 25, ఇంకా 5 కుటుంబాల నుండి సేకరించాల్సి ఉంది. గుర్తించలేని కుటుంబాల సంఖ్య 3, DNA ద్వారా మ్యాచ్ అయిన నమూనాలు 5,పూర్తయిన పోస్టుమార్టం (PME): 36 మృతుల కుటుంబాలకు రూ.1,00,000 చొప్పున మంజూరు.చేసిన కుటుంబాల సంఖ్య: 18, గాయపడిన వారికి రూ.50,000 చొప్పున మంజూరైనవారు 34,

తాత్కాలిక ఆర్థిక సహాయంకింద 18 మృతుల కుటుంబాలకు



రూ.1,00,000 చొప్పున, గాయపడిన 34 మందికి రూ.50,000 చొప్పున చెల్లించిన తాత్కాలిక సహాయం,

మిస్సింగ్ అయిన 10 కార్మికుల కుటుంబాలకు రూ.10,000 చొప్పున తాత్కాలిక సహాయం అందించడం జరుగుతుందన్నారు.

బాధిత కుటుంబాలు లేదా వారి బంధువులు సమాచారం కోసం సంగారెడ్డి కలెక్టరేట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన హెల్ప్‌లైన్ నంబర్ 08455-276155 ను సంప్రదించవచ్చు. ఈ హెల్ప్‌డెస్క్ ద్వారా వారి అవసరాలపై సత్వర స్పందించడానికి సిబ్బంది కార్యాలయ పని వేళల్లో అందుబాటులో ఉంటారని కలెక్టర్ తెలిపారు.

# అగ్నిమాపక కేంద్రం స్థలాన్ని శుభ్రం చేయండి

**- మున్సిపల్ కమీషనర్‌కి వినతిపత్రం**

**సంగారెడ్డి, జూలై 2 (వార్త వేదిక సూర్య):**
సంగారెడ్డి జిల్లాబొల్లారం మున్సిపల్ పరిధిలోని బాలాజీ నగర్‌లో కొన్ని సంవత్సరాలక్రితం అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు కోసం ప్రభుత్వం స్థలాన్ని కేటాయించింది. అట్టి స్థలంలో అధికారులు అగ్నిమాపక కేంద్రం నిర్మాణం చేపట్టలేదు. బుధవారం బాలాజీ నగర్‌కి చెందిన కొంతమంది యువత గుండ్ల భార్గవ్ రెడ్డి ఆధ్వ ర్యంలో బొల్లారం మున్సిపల్ కమీషనర్ బి.కిషన్‌ని మర్యాద పూర్వ కంగా కలిసారు. అనంతరం బాలాజీ నగర్‌లో నిరూపయోగంగా ఉన్న అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు చెసిన స్థలాన్ని శుభ్ర పరిచి యువత అందులో అట స్థలంగా వాడుకునేందుకు అవకాశం కల్పించాలంటూ వినతిపత్రం అందచేశారు. ఇప్పటికే ఆ స్థలంలో భవన వ్యర్థాలు, చెత్త, చెదారంతో పాటు కొన్ని నిరూపయోగ మొక్కలతో నిండిపోయిందనిఅట్టి స్థలన్ని శుభ్ర పరిచి యువకులకు క్రీడా సామర్థ్యం పెంచుకోవడానికి ఆ స్థలాన్ని శుభ్రం చేయించాలని ఒక వినతిపత్రం ఇచ్చారు. అనంతకుముందు బాలాజీ నగర్ యువకులు కమిషనర్‌ని శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఓ నరసింహులు, హరీష్, అర్జున్, ఆనంద్, ఆదర్శ్, యువరాజ్, విజయ్, ప్రిన్స్, కుందన్, సతీష్ ఉన్నారు.



# ఎమ్మెల్యే జిఎంఆర్ ఉదారత..

- **కొడకంచి అంగన్వాడి కేంద్రానికి లక్ష రూపాయలు..**
- **జిన్నారం ఎస్టి గురుకుల పాఠశాల మౌలిక వసతులకు 87 వేల రూపాయలు..**
- **కొర్లకుంట చిత్తారమ్మ ఆలయ నిర్మాణానికి 2 లక్షల రూపాయల విరాళం..**
- **త్వరలోనే 28 లక్షల రూపాయల సొంత నిధులతో చిత్తారమ్మ ఆలయ పనులు పూర్తి**

**సంగారెడ్డి(జిన్నారం),జూలై 2 (వార్త వేదిక సూర్య):**
పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి మరోసారి తన ఉదారతను చాటుకున్నారు. జిన్నారం మండలం కొర్లకుంట గ్రామంలో నిర్మిస్తున్న చిత్తారమ్మ దేవాలయానికి గతంలో 26 లక్షల రూపాయల సొంత నిధులు అందించగా.. మిగిలిన పనుల కోసం మంగళవారం మరో రెండు లక్షల రూపాయలు అందించారు. అదే విధంగా.. జిన్నారంలో నిర్మిస్తున్న శివాజీ స్టేడియం బోర్డ్ ఏర్పాటు కోసం 37 వేల రూపాయలు, జిన్నారం పరిధిలోని ఎస్టీ గురుకుల పాఠశాలలో మంచి నీటి పైపులైన్లు, ఎర్తింగ్ పనుల కోసం 90 వేల రూపాయలను అందించారు. మంగళవారం సాయంత్రం పటాన్చెరులోని క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా పరిషత్ మాజీ వైస్ చైర్మన్ ప్రభాకర్, మాజీ



సర్పంచులు జనార్ధన్, శివరాజ్, ఆంజనేయుల సమక్షంలో సంబంధిత ప్రతినిధులకు డబ్బులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జిఎంఆర్ మాట్లాడుతూ.. నియోజకవర్గ వ్యాప్తంగా సొంత నిధులచే దేవాలయాలు, మసీదులు, చర్చిలు నిర్మిస్తూ పరమత సహనాన్ని పెంపొందిస్తున్నామని తెలిపారు. అభివృద్ధిలో ప్రతి ఒక్కరిని భాగస్వాములు చేస్తూ ముందుకు వెళు తున్నామని తెలిపారు. కొడకంచి గ్రామంలో నిర్మిస్తున్న అంగన్వాడి సెంటర్ భవన నిర్మాణ పనులను ప్రతిఘటన పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. రాబోయే ఆగస్టు నెలలో వీటిని ప్రారంభించనున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో అమీన్పూర్ మాజీ జెడ్పిటిసి సుధాకర్ రెడ్డి, సీనియర్ నాయకులు అంతిరెడ్డి, బండి శంకర్, తదితరులు పాల్గొన్నారు.

www.vaarthavedhikasurya.com
వార్త వేదిక సూర్య
VAARTHA VEDHIKA SURYA - TELUGU DAILY






## ఎల్ఓసి చెక్కు బాధితునికి అందజేసిన మార్కెట్ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య

**చౌటుప్పల్, జూలై 2 (వార్త వేదిక సూర్య):**
చౌటుప్పల్ మున్సిపాలిటీలో 11వ వార్డుకు చెందిన బాల్యం చంద్రయ్య అత్యవసర కాలు చికిత్స నిమిత్తం మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సహకారంతో బుధవారం చౌటుప్పల్ మార్కెట్ కమిటీ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య బాధితుడు బాల్యం చంద్రయ్య 75,000 వేల రూపాయల ఎల్ఓసిని అందజేశారు. ఈ కార్యక్రమం లో మాజీ జెడ్పిటిసి చిలుకూరు ప్రభాకర్ రెడ్డి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మరియు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఆకుల ఇంద్రసేనారెడ్డి మండల పార్టీ అధ్యక్షులు బోయ దేవేందర్ గారు మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు లిసుర్వి నరసింహా గౌడ్ మాజీ కౌన్సిలర్ కొయ్యడ సైదులు గౌడ్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గుండు మల్లయ్య మెగుదాల రమేష్ గౌడ్ 11వ వార్డ్ అధ్యక్షులు గోశిక వినయ్ గుర్రం పాండురంగం తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ ఆందోల్ మైసమ్మ దేవాలయ ఉండి లెక్కింపు

**చౌటుప్పల్, జూలై 2 (వార్త వేదిక సూర్య):**
యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలంలోని దండ మల్కాపురంలోని శ్రీ ఆందోల్ మైసమ్మ దేవాలయం హుండీని బుధవారం హుండీ విప్పి లెక్కించగా 105 రోజులకు 10,94,990 రూపాయలు వచ్చినట్లు కార్యనిర్వాహణ అధికారి సల్వాది మోహన్ బాబు తెలిపారు. ఇట్టి కార్యక్రమంలో కె భాస్కర్ సహాయ



కమిషనర్ నల్గొండ మరియు దేవస్థానం చైర్మన్ చిలుకూరి మల్లారెడ్డి ధర్మకర్తలు బుర్ర స్వామి గౌడ్, కంచర్ల ప్రవీణ్ రెడ్డి, అత్తాపురం అంజిరెడ్డి, గుండ్ల అశోక్, చింతంపల్లి జంగయ్య, ఎల్లంకి రమేష్ చారి, ఎద్దుల పరమేష్ యాదవ్, చేపూరి మహేష్, పబ్బు కిరణ్ గౌడ్, శ్రీమతి సంఘం యాదమ్మ మల్లేష్, అర్చకులు శివప్రసాద్ శర్మ, జూనియర్ అసిస్టెంట్ ఏ. సత్తిరెడ్డి మరియు భక్తులు పాల్గొన్నారు.

## ఆధ్యాత్మిక కార్యక్రమాలు ప్రజల్లో భక్తి, శాంతి, సమన్వయ భావాలను పెంపొందిస్తాయి

**- ఎమ్మెల్యే డా.సంజయ్ కుమార్**

**జగిత్యాల, జూలై 2 (వార్త వేదిక సూర్య):**
జగిత్యాల జిల్లా కేంద్రంలో ఇస్కాన్ మెట్పల్లి వారి ఆద్వర్యంలో జగన్నాధ రథ యాత్ర ప్రారంభం సందర్భంగా జగిత్యాల రోటరీ క్లబ్ వద్ద పాల్గొని జగిత్యాల



ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాజిక సమగ్రతను పెంపొందించే ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు ప్రజల్లో భక్తి, శాంతి, సమన్వయ భావాలను పెంపొందిస్తాయి అని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ గోలి శ్రీనివాస్,నాయకులు అడువల లక్ష్మణ్,చెట్పల్లి సుధాకర్,డిష్ జగన్,శివ కేసరి బాబు,దుమాల రాజ్ కుమార్, కుసరి అనిల్,పిట్ట ధర్మరాజు, భోగ చిన్న జి ఆర్,కత్రోజ్ గిరి,రంగు మహేష్,పోతునుక మహేష్, రవి శంకర్,భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో యువకుడు దుర్మరణం

**దేవరకొండ, జూలై 2(వార్త వేదిక సూర్య):** కొండమల్లేపల్లి మండల పరిధిలోని చిన్న అడిసర్ల పల్లి గ్రామ శివారులో జడ్చర్ల -కోదాడ జాతీయ రహదారిపై మంగళారం రాత్రి రోడ్డు ప్రమాదం జరిగినది ఈ ప్రమాదంలో బైక్ పై ఉన్న చింతకుంట్ల గ్రామానికి చెందిన ఐతరాజు అజయ్ (22) అనే యువకుడు మృతి చెందడం జరిగినది మరో యువకుడు అంజి తీవ్ర గాయాలు కావడం జరిగినది వీరిని దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు నిర్వహిస్తున్నానని కొండమల్లేపల్లి ఎస్సై తెలిపారు







## ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న కలిసిన ముదిరాజ్ సంఘం నాయకులు

**చౌటుప్పల్, జూలై 2 (వార్త వేదిక సూర్య):**
యాదాద్రి భువనగిరి జిల్లా, చౌటుప్పల్ మున్సిపాలిటీ, తంగడపల్లికి చెందిన గట్టు మొగలయ్య ముదిరాజ్, తంగడపల్లి ముదిరాజ్ సంఘం అధ్యక్షులు గట్టు వెంకటేష్ ముదిరాజ్ అధ్వర్యంలో ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న, తెలంగాణ బిసి పోలిటికల్ జె.ఏ సి కోఆర్డినేషన్ కమిటీ చైర్మన్ సుదగాని హరిశంకర్ గౌడ్ని మర్యాద పూర్వకంగా కలిసి, మల్లన్న చేపడుతున్న బిసి ఉద్యమాన్నికి సంపూర్ణ మద్ధతు తెలియ జేశారు. బీసీల కొరకు ఉద్యమిస్తున్న ఎమ్మెల్సీ తీన్మార్ మల్లనను బొకే, శాలువాతో ఘనంగా సన్మానించడం జరిగింది

ఈ సందర్భంగా మల్లన్న మాట్లాడతూ రాబోయే 2028 సార్వత్రిక ఎన్నికల్లో బిసి ముఖ్యమంత్రి అవడం ఖాయం అని ఆయన అన్నారు. మన బిసి ప్రభుత్వం రాగానే బిసి ప్రజలకు 2 ఎకరాల భూమి ని పంపిణి చేస్తామని అన్నారు.

అదే విధంగా వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసి లు అంతా కలిసి కట్టుగా పోరాడి మన బిసిల అధికార కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు . ఈ కార్యక్రమంలో బిసి పోలిటికల్ జె.ఏ.సి సమన్వయకర్త బందారపు నర్సయ్య గౌడ్ , బొల్లమోని శంకరయ్య ముదిరాజ్ గారు, సిలివేరు వెంకటేష్ శాలివాహన, జెట్ట ముత్యాలు కురుమ, గట్టు లింగస్వామి ముదిరాజ్, నక్క శివకుమార ముదిరాజ్, అన్నమోని వెంకటేష్ ముదిరాజ్, బొల్లమోని స్వామి ముదిరాజ్, కందుల పరమేష్ ముదిరాజ్, బొల్లమోని సంపత్ కుమార్ ముదిరాజ్, రాచకొండ పురుషోత్తంచారి, నక్క నాగరాజు ముదిరాజ్ , పగిళ్ల మల్లేష్ రజక మరియు ముదిరాజ్ ఇతర బిసి కులాల నాయకులు పాల్గొన్నారు.

## నూతన చాళుక్య గ్రాండ్ రెస్టారెంట్ ప్రారంభోత్సవం

### జగదేవ్పూర్ చౌరస్తాలో అట్టహాసంగా ప్రారంభమైన హెూటల్ రాఘవేంద్ర

**యాదాద్రి భువనగిరి, జూలై 2 (వార్త వేదిక సూర్య):**
యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలోని స్థానిక జగదేవ్ పూర్ చౌరస్తా వద్ద చాళుక్య గ్రాండ్ రెస్టారెంట్, రాఘవేందర్ హెూటల్ యజ మాన్యం తల్లూరు సుభాష్ శెట్టి,శ్రీనివాస్ శెట్టి,అశోక్ శెట్టి బ్రదర్స్ ఆధ్వర్యంలో నూతన హెూటల్ ను బుధవారం రోజు కాంగ్రెస్ పార్టీ యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షుడు అండెం సంజీవరెడ్డి, గ్రంథాలయ చైర్మన్ అవేస్ చిస్తీ ముఖ్యఅతిథిగా పాల్గొని నూతన ప్రారంభించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... భువనగిరి పట్టణ కేంద్రంలో ప్రజలకు, ప్రయాణికులకు అందుబాటులో ఈ కొత్త ఏర్పాటు చేసిన చాళుక్య గ్రాండ్ రెస్టారెంట్ హెూటల్ని ప్రారం భించడం మాకు చాలా సంతోషంగా ఉందని అనంతరం హెూటల్ యజమానులు



తల్లూరు సుభాష్ శెట్టి,తల్లూరు శ్రీనివాస్ శెట్టి,అశోక్ శెట్టి బ్రదర్స్కి ఆర్థిక శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో హెూటల్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు సద్ది వెంకటరెడ్డి, మార్కెట్ కమిటీ



మాజీ చైర్మన్ పోతన ప్రమోద్ కుమార్, భువనగిరి మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ మాయ దశరథ, ,చందా మహేందర్ గుప్తా, ఏ ఐ టియుసి నాయకులు ఇమ్రాన్,,స్థానిక వివిధ పార్టీల నాయకులు, భువనగిరి పట్టణ వ్యాపార వేత్తలు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.





## ప్రతి ఒక్కరికి ఉద్యోగ విరమణ ఏదో ఒక రోజు తప్పదు

**- ఏసీపీ మధుసూదన్ రెడ్డి**

**చౌటుప్పల్, జూలై 2 (వార్త వేదిక సూర్య):**
ప్రతి ఒక్కరికి ఉద్యోగ విరమణ తప్పకుండా ఏదో ఒక రోజు వస్తుందని చౌటుప్పల్ ఏసీపీ మధుసూదన్ రెడ్డి అన్నారు బుధవారం చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధి పోలీస్ స్టేషన్లో పనిచేస్తున్న ఎస్ఐ యాదవ రెడ్డి ఉద్యోగ విరమణ సన్మానం జయశ్రీ ఫంక్షన్ హాల్లో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ అనంతరం ఎసిపి మసూదన్ రెడ్డి సిఐ మన్మధకుమార్ యాదవ రెడ్డిని పూలమాలలు మరియు శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం ఏసిపి మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ ఉద్యోగ జీవితంలో ఏదో ఒక రోజు ఉద్యోగ విరమణ చేయవలసిందిగా అలాగే యాదవ రెడ్డి చాలా సిన్సియర్ గా ఉద్యోగ బాధ్యతలు నిర్వహించారని అన్నారు అలాగే తన శేష జీవితంలో ఆయురారోగ్యాలతో పాటు కుటుంబంతో సంతోషంగా గడపాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐ మన్మధ కుమార్ అలాగే రూరల్ సీఐ రాములు చౌటుప్పల్ ఎస్సైలు యాదగిరి నర్సిరెడ్డి రామన్నపేట ఎస్సై మల్లయ్య నారాయణపురం ఎస్సై జగన్ మరియు పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## గురుకుల పాఠశాల పరిశీలనకు వచ్చి విద్యార్థులతో పెయింటింగ్ వేయిస్తున్న జిల్లా జోనల్ ఆఫీసర్పై చర్యలు తీసుకోవాలి

**- ఎస్.ఎఫ్.ఐ.డిమాండ్**

**మోత్కూరు, జూలై 02 (వార్త వేదిక సూర్య):**
మోత్కూరు మండలంలో ఉన్న సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల హాస్టల్ను భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్.ఎఫ్.ఐ) నాయకులు బుధవారం నాడు సందర్శించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు వేముల నాగరాజు మాట్లాడుతూ హాస్టలల్లో కనీస సౌకర్యాలు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. హాస్టల్ పరిశీలనకు బుధవారం నాడు వచ్చిన జిల్లా జోనల్ ఆఫీసర్ విద్యార్థులతో హాస్టలలో పెయింటింగ్ వేయిస్తు న్నారని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం ఆర్భాటంగా రాష్ట్రవ్యాప్తంగా



గురుకులాలకు మంచి సౌకర్యాలు కల్పించి విద్యార్థులను అభివృద్ధి వైపు విద్య వైపు పేద మధ్యతరగతి విద్యార్థుల తలరాతలు మార్చే విధంగా చేస్తామంటున్నారు కానీ ఆచరణంలో అమలు చేయడంలో పూర్తిగా వైఫల్యం చెందిందని విమర్శించారు.

హాస్టలల్లో విద్యార్థులకు కూర్చోవడానికి బెంచీలు లేక పడుకోవడానికి బెడ్లు షీట్లు లేక కప్పుకోవడానికి దుప్పట్లు లేక తీవ్ర అవస్థలు పడుతుంటే పరిశీలనకు వచ్చిన జోనల్ ఆఫీసర్ విద్యార్థులను తరగతి క్లాసుల్లో నుండి పిలిచి పెయింటింగ్ వేయించడం సరైన విధానం కాదు తక్షణమే జోనల్ ఆఫీస్పై వెంటనే జిల్లా ఉన్నతాధికారులు చర్యలు తీసుకో వాలని ఎస్ఎఫ్ఐగా డిమాండ్ చేస్తున్నామన్నారు.ఈ కార్యక్రమంలో ఆయన వెంట ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు పుట్టల ఉదయ్ ఉన్నారు.

## ఉపాధ్యాయులకు పదోన్నతులు బదిలీలు వెంటనే చేపట్టాలి

### ఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు బిక్షపతి

**మోత్కూరు, జూలై 02(వార్త వేదిక సూర్య):**
ఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయులకు బదిలీలు పదోన్నతులను ప్రభుత్వం వెంటనే చేపట్టాలని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కొంపల్లి బిక్షపతి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం నాడు మోత్కూరు, అడ్డగూడూరు మండలాల పరిధిలో వివిధ పాఠశాలలోని నిర్వహించిన ఆ సంఘం సభ్యత్వ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో బిక్షపతి పాల్గొన్నారు. ఈ సందర్భంగా బిక్షపతి మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయ, ఇతర పోస్టులు వందలాదిగా ఖాళీగా ఉన్నాయని వాటిని వెంటనే భర్తీ చేయవల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. గతంలో 317 జీవో వల్ల ఉపాధ్యాయులు బదిలీలు భాగంగా చెట్టుకొక్కరు పుట్టుకొక్కరు అన్నట్లుగా బదిలీ జరిగిందని అటువంటి ఉపాధ్యాయులందరికీ న్యాయం చేయాలన్నారు. ఉపాధ్యాయులకు అడ్డుగా మారిన జీవో నెంబర్ 2



రద్దు చేయాలని హైయ్యర్ ఎడ్యుకేషన్ వేసేందుకు అడ్డంకి మారిన మెమో నెం.. 26559ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బోల్లెద్దు కరుణాకర్, జిల్లా కోశాధికారి దుబ్బాక యాదయ్య, వెంకటయ్య, మండల నాయకులు మేడి వెంకటేశ్వర్లు, దర్శనం వెంకన్న, బండారు మల్లయ్య, బోల్లెద్దు సరోజ, జక్కుల శ్రవణ్ కుమార్, ఎర్ర శంకర్, ఊట్కూరి మహేష్, కొనాని వెంకటేష్, ముక్కెర్ల నర్సింహ్మా, బుప్పాని వెంకటేశ్వర్లు, కే.తిరుమలదేవి, టి.రవి, డి తిరుపతి, ఎం.జయ శ్రీ, కే.శ్రీనివాస్ రవి కుమార్, లలిత కుమారి, నరేష్ ,జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

www.vaarthavedhikasurya.com
వార్త వేదిక సూర్య
తెలుగు దినపత్రిక
VAARTHA VEDHIKA SURYA - TELUGU DAILY



# బెస్ట్ ఆవేలేబుల్ స్కూల్ నిధులు విడుదల చేయండి

**దళిత అభివృద్ధి శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మన్ కుమార్‌కి వినతి పత్రం అందజేత**

**సానుకూలంగా స్పందించిన మంత్రి నిధులు త్వరలో విడుదల చేస్తామని హామీ**

**యాదాద్రి,జూలై 2(వార్త వేదిక సూర్య):** రాష్ట్ర వ్యాప్తంగా గత మూడు సంవత్సరాలుగా పెండింగులో ఉన్న బెస్ట్ ఆవేలేబుల్ స్కూల్ పథకం నిధులు విడుదల చేయాలని కోరుతూ రాష్ట్ర దళిత అభివృద్ధి శాఖ మంత్రివర్యులు అడ్లూరి లక్ష్మణ్ కుమార్ కి వినతి పత్రం అందజేయడం జరిగింది. జిల్లాకు వచ్చిన మంత్రిని కలిసిన సందర్భంగా బెస్ట్ ఆవేలేబుల్ స్కూల్ పథకం క్రింద దళిత, గిరిజన విద్యార్థులు వేలాదిగా విద్యాను అభ్యసిస్తున్నారని, వీరికి ఆయా పాఠశాలలు విద్యతో పాటుగా యూనిఫామ్స్, పాఠ్యపుస్తకాలు, టై, బెల్ట్ కూడా ఉచితంగా ఇవ్వవలసి ఉండగా ఇవేవీ కూడా ఇవ్వడంలో జాప్యం చేస్తూ విద్యార్థులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. గత మూడు సంవత్సరాలకు పైగా పెండింగులో ఉండటం వల్ల విద్యార్థులపట్ల ఆయా పాఠశాలల యాజమాన్యాలు వివక్షను చూపిస్తున్నాయని తెలియజేసారు.

అందువల్ల వెంటనే నిధులు విడుదలచేసి విద్యార్థులకు అన్ని సౌకర్యాలు అందెలాగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈసందర్భంగా మంత్రివర్యులు అడ్లూరి లక్ష్మణ్ కుమార్ సానుకూలంగా స్పందించి అతి త్వరలో ఈ నిధులను విడుదల చేయుటకు కృషి చేస్తున్నమని, ఈసమస్య పరిష్కారానికి ప్రభుత్వం పూర్తి చిత్తశుద్ధితో ఉన్నదని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో భువనగిరి మాజీ మున్సిపల్ చైర్మన్ బర్రె జహంగీర్, పీపుల్స్ మానిటరింగ్ కమిటీ రాష్ట్ర కన్వీనర్ సురుపంగ శివలింగం, మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర సహాయ కార్యదర్శి ఇటుకల దేవేందర్, ఎం ఎస్ ఎఫ్ జిల్లా భాద్యులు కొల్లూరి హరీష్ తదితరులు పాల్గొన్నారు.

# స్టడీ సర్కిల్స్ పునరుద్ధరించాలి

**కెవిపిఎస్ ఆధ్వర్యంలో మంత్రికి వినతి**

**సమస్యల వలయంలో ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు**

**అట్రాసిటీ బాధితులకు సకాలంలో పరిహారం అందించాలి.**

**బాస్ స్కీం, పెండింగ్ స్కాలర్షిప్ నిధులు విడుదల చేయాలి.**

**విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ నియమించాలి.**

**సానుకూలంగా స్పందించిన మంత్రి అడ్లూరు లక్ష్మణ్ కుమార్**

**నల్లగొండ , జూలై 2 (వార్తా వేదిక సూర్య):** నల్లగొండ జిల్లాలో ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీల విద్యార్థుల, యువత మరియు సంక్షేమ హాస్టల్స్ యొక్క సమస్యలు జఠిలంగా ఉన్నాయని వాటన్నింటిని పరిష్కారం చేయాలని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం జిల్లా కార్యదర్శి పాలడుగు నాగార్జున సాంఘిక సంక్షేమ శాఖా మంత్రి కి విజ్ఞప్తి చేశారు.



బుధవారం ఉమ్మడి నల్లగొండ జిల్లా సమీక్ష సమావేశానికి జిల్లా కలెక్టరేట్ లో హాజరైన ఎస్సీ ఎస్టీ మైనార్టీ సంక్షేమ శాఖా మంత్రివర్యులు అడ్లూరి లక్ష్మణ్ కుమార్ కి కెవిపిఎస్ నల్లగొండ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో వివిధ సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి స్పందిస్తూ బెస్ట్ అవైలబుల్ స్కీమ్ వంటి వాటికి వారం రోజులలోనే నిధులు విడుదల చేస్తామని హామీ ఇచ్చారు. మిగతా సమస్యలన్నింటినీ పరిశీలించి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలడగు నాగార్జున మాట్లాడుతూ.. గత కొంత కాలంగా ఎస్సీ ఎస్టీ బి.సి,మైనారిటీల సంక్షేమానికి సంబంధించిన సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదన్నారు. బడ్జెట్‌లో అంకెలలో నిధులు కేటాయింపులు జరుగుతున్నా ఆచరణలో మాత్రం మంజూరు కావడం లేదని,నల్లగొండ జిల్లాకు సంబంధించిన యువత, విద్యార్థులు అనేక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని,దళిత, గిరిజన,మైనార్టీ ప్రజాసంఘాలతోను, యువతతోను, విద్యార్థులతోను ప్రత్యేకమైన సమావేశాన్ని ఏర్పాటు చేసి సమస్యలను పరిష్కరించాలన్నారు. నల్లగొండ జిల్లా కేంద్రంలోని బి.కే పెంటయ్య హాస్టల్ భవనం శిథిలావస్థకు చేరిందని,నిధులు కేటాయించి నిర్మాణాన్ని చేపట్టాలన్నారు. నల్లగొండ జిల్లాలో అంబేద్కర్ భవన నిర్మాణాలకు స్వల్పమైన నిధులు మాత్రమే మంజూరు చేశారు. అవి చాలిచాలక గత నాలుగు ఏళ్లుగా నిర్మాణాన్ని చేపట్టడం లేదన్నారు. మంజూరైన 70 భవనాలకు ఒక్కొక్క భవనానికి కనిష్ఠంగా 20 లక్షల నిధులు కేటాయించే విధంగా చొరవ చూపాలని,అదేవిధంగా నల్లగొండ జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ సాంస్కృతిక ఆడిటోరియం సౌండ్ సిస్టం సరిగ్గా లేకపోవడం వలన నిరుపయోగంగా ఉన్నది. అవసరమైన నిధులు కేటాయించి తక్షణమే పూర్తిస్థాయిలోకి వినియోగంలోకి తీసుకు రావాలని కోరారు. జిల్లాలో ఎస్సీ ఎస్టీ ల పై జరుగుతున్న దాడులపై పోలీస్ శాఖా వేగవంతంగా స్పందించి విచారణ చేపట్టి బాధితులకు న్యాయం జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని,ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు కింద బాధితులకు వచ్చే పరిహారం నిధులు లేక పెండింగ్‌లో ఉన్నాయని తక్షణమే నిధులను విడుదలచేయయాలన్నారు. జిల్లాలో పెండింగ్‌లో ఉన్న POTలకు సంబంధించిన భూముల సమస్యలను పరిష్కరించాలన్నారు. ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటిని నియమించుటకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రమోషన్‌లలో దళిత గిరిజనులకు రిజర్వేషన్లను అమలు చేయడం లేదని,అడెక్వసీ విధానం ప్రమేషన్స్ ద్వారా అడ్డుకుంటున్నారని దీనిని తొలగించాలన్నారు. కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు కొండేటి శ్రీను మాట్లాడుతూ రాజీవ్ యువ వికాసం ద్వారా దళిత గిరిజనులకు 10 లక్షల వరకు వ్యక్తిగత రుణాలు మంజూరు చేయాలన్నారు. పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీలకు గతంలో స్టడీ సర్కిల్స్ ఏర్పాటు చేసిన వాటిని ఎత్తివేయడం జరిగిందని పేద విద్యార్థుల ఉద్యోగ భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని తక్షణమే ఆ స్టడీ సర్కిల్స్ ను పునరుద్ధరించాలన్నారు. సంక్షేమ హాస్టల్స్ లో మౌలిక వసతులను మెరుగుపరుస్తూ,పక్కా భవనాలను నిర్మించుటకు చర్యలు తీసుకోవాలని, పెండింగ్‌లో ఉన్న మెస్ బిల్లుల అన్నింటిని విడుదల చేయాలన్నారు. సంక్షేమ హాస్టల్స్‌లో పెట్టెలు,దుప్పట్లు,ప్లేట్లు, గ్లాసులు ,ఆట వస్తువులు కొంతకాలంగా ఇవ్వడం లేదని,వాటిని వెంటనే ఇప్పించే విధంగా చొరవ చూపాలని, వంట మనుషుల, స్కావెంజర్స్, కొరత తీవ్రంగా ఉన్నది అవసరమైన సిబ్బందిని తక్షణమే నియమించాలన్నారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ రాష్ట్ర నాయకులు రెమిడాల పరుశరాములు,గాదె నరసింహ,, ఒంటెపాక కృష్ణ ,బొల్లు రవీందర్ తదితరులు పాల్గొన్నారు.








# నల్గొండ జిల్లా అభివృద్ధికి కృషి చేస్తా..

**● జిల్లా ఇన్చార్జి మంత్రి, రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సంక్షేమ శాఖల మంత్రి అడ్లూరు లక్ష్మణ్ కుమార్**

**నల్లగొండ , జూలై 2 (వార్తా వేదిక సూర్య):** నల్గొండ జిల్లా మంత్రులు, ఎంపీలు ,ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారుల సహకారంతో నల్గొండ జిల్లాను ముందుకు తీసుకు వెళ్లేందుకు తనవంతు కృషి చేస్తానని జిల్లా ఇన్చార్జి మంత్రి, రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సంక్షేమ శాఖల మంత్రి అడ్లూరు లక్ష్మణ్ కుమార్ తెలిపారు. బుధవారం నల్గొండ జిల్లా కలెక్టర్ కార్యాలయ ఆవరణలోని ఉదయాదిత్య భవన్ లో నిర్వహించిన ఉమ్మడి నల్గొండ జిల్లా సమీక్ష సమావేశంలో మంత్రి మాట్లాడుతూ అధికారులు క్షేత్రస్థాయిలో ప్రభుత్వ పథకాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. వ్యవసాయ సమీక్ష సందర్భంగా మంత్రి మాట్లాడుతూ....రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అన్ని రకాలుగా అండగా ఉంటుందని, ప్రతిరోజు రైతులకు సంబంధించిన అంశాలపై మండల స్థాయి అధికారులతో జిల్లా అధికారి పర్యవేక్షణ చేయాలన్నారు. రైతు భరోసా, రైతు బీమా, ఎరువులు, విత్తనాల విషయంలో ప్రత్యేక దృష్టి నిలపాలని చెప్పారు. గత ప్రభుత్వం రైతులను నిర్లక్ష్యం చేసిందని, అలాకాకుండా తమ ప్రభుత్వం రైతులకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చి రైతు భరోసా వంటి ప్రతిష్టాత్మక పథకాలను అమలు చేస్తున్నదని అన్నారు. జిల్లాలోని ఇరిగేషన్ ప్రాజెక్టులన్నింటిని పూర్తిచేసేందుకు తన వంతు సహకారం అందిస్తానని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్లను త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని, ఇరిగేషన్ ప్రాజెక్టులు, వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లకు సంబంధించి విద్యుత్ శాఖ అధికారులు శాసనసభ్యుల విజ్ఞప్తుల మేరకు సమస్యలు రాకుండా చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఉమ్మడి నల్గొండ జిల్లా అభివృద్ధికి పక్షం రోజులకు ఒకసారి సమీక్ష సమావేశం నిర్వహించేందుకు ప్రయత్నిస్తామని తెలిపారు. రాష్ట్ర నీటిపారుదల పౌరసరఫరాల శాఖ మంత్రి నల్లమాడ ఉత్తంకుమార్ రెడ్డి మాట్లాడుతూ ఈనెల 14న రాష్ట్ర ముఖ్యమంత్రి చేతుల మీదుగా తుంగతుర్తి నియోజకవర్గం, తిరుమలగిరిలో నూతన రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం ఉంటుందని తెలిపారు. అప్పటివరకు రేషన్ కార్డుల కై వచ్చిన దరఖాస్తులన్నింటిని ఈనెల 13 లోగా పరిశీలించి అర్హులైన వారందరినీ ఎంపిక చేయాలని జిల్లా కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేశారు. ఉమ్మడి నల్గొండ జిల్లాకు గొప్ప చరిత్ర ఉందని,జిల్లా ప్రజాప్రతినిధులు ,అధికారులు అందరూ కలిసి ఉమ్మడి జిల్లాను ఒక స్థాయికి తీసుకు వెళ్తామని చెప్పారు. ఉమ్మడి నల్గొండ జిల్లాలోని ప్రాజక్టు లన్నింటిని పూర్తి చేసేందుకు కృషి చేస్తామని, ప్రాజెక్టుల భూసేకరణ పై శాసనసభ్యులు ప్రత్యేక దృష్టి నిలపాలని కోరారు. ఎస్ఎల్బీసీ పనుల పునః ప్రారంభానికి పూర్తిస్థాయిలో కృషి చేస్తున్నామని, భారత సైన్యం లో పనిచేసిన అధికారులను డిప్యూటేషన్ పై తీసుకొని ఎలక్ట్రో మాగ్నెటిక్ లీడర్ సర్వే నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. డిండి, హెచ్ ఎల్ సి లైనింగ్ , నెల్లికల్ లిఫ్ట్ ఇరిగేషన్ బునియాధిగాని కాలువ, పిల్లాయిపల్లి కాలువ, ధర్మారెడ్డి కాలువలను పూర్తి చేస్తామని అయితే వీటి భూసేకరణను పూర్తి చేసే విషయంపై శాసనసభ్యులు దృష్టి నిలపాలని కోరారు. అధికారులు ఆయా పథకాలకు లబ్ధిదారులు ఎంపికలో అవినీతికి ఆస్కారం లేకుండా చూడాలని, నిజాయితీ, పారదర్శకతతో ప్రజలకు కనిపించేలా పని చేయాలని, నెలలో రెండుసార్లు సమీక్ష సమావేశం నిర్వహిస్తామని తెలిపారు. రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి



కోమటిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ..

ఆర్ అండ్ బి ద్వారా నల్గొండ జిల్లాకు ఎక్కువ నిధులు తేవడం జరిగిందని, భవిష్యత్తులో మరిన్ని నిధులు ఇచ్చేందుకు కృషి చేస్తానని 45 కోట్లతో సంగెం బ్రిడ్జికి మంజూరు ఇవ్వడం జరిగిందని, నల్గొండ -మల్లేపల్లి -దేవరకొండ రహదారులను హామ్ రోడ్ కింద మంజూరు చేశామని, రాష్ట్రవ్యాప్తంగా 1200 కోట్ల రూపాయలతో అన్ని మండల కేంద్రాల నుండి జిల్లా కేంద్రాలకు హాం పథకం కింద డబుల్ రోడ్ల నిర్మాణానికి మంజూరు చేయడం జరిగిందని, పంచాయతీరాజ్ రోడ్లను సైతం హామ్ కింద కు తీసుకొస్తున్నట్లు తెలిపారు. ఎస్ ఎల్ బి సి, టన్నెల్ పూర్తి చేసేందుకు చిత్తశుద్ధితో కృషి చేస్తున్నామని ,ఇరిగేషన్ ప్రాజెక్టుల భూసేకరణ పై ప్రత్యేకంగా రివ్యూ చేస్తామని ,ఇన్చార్జి మినిస్టర్ జిల్లాకు ఎక్కువ సమయం కేటాయించాలని, ప్రాథమిక వైద్యం, విద్య ప్రభుత్వానికి అతి ముఖ్యమైనవని, వీటిపై ఎక్కువ దృష్టి కేంద్రీకరించాలని , విద్యలో భాగంగా ఇంటిగ్రేటెడ్ కాంప్లెక్స్ పనులను త్వరలోనే ప్రారంభం చేయనున్నామని తెలిపారు. అధికారులు క్షేత్రస్థాయిలో బాగా పనిచేయాలని, ఎస్డిఎఫ్ కింద ప్రతి ఎమ్మెల్యేలకు తక్షణమే ఐదు కోట్ల రూపాయలు మంజూరు చేసేందుకు సిద్ధంగా ఉన్నామని , ఇందుకు సంబంధించి టోకెన్లు రైజ్ చేయాలని ఎమ్మెల్యేలతో కోరారు. ఎనిమిది నెలల్లో నల్గొండ కలెక్టరేట్లో చేపట్టిన అదనపు బ్లాకు నిర్మాణాన్ని పూర్తి చేస్తామని మంత్రి తెలిపారు. రాచకాలవల గుర్రపుడెక్కలతో నిండిపోయిందని, ఈ కాల్వ పై సమన్వయ లోపం ఉందని, అలాగే నిర్వహణకు నిధులు లేవని భువనగిరి పార్లమెంట్ సభ్యులు చమల కిరణ్ కుమార్ రెడ్డి ఇరిగేషన్ శాఖ మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. నల్గొండ పార్లమెంట్ సభ్యులు కుందూరు రఘువీర్ రెడ్డి మాట్లాడుతూ చిత్రియాల్, రాములోరి బండ లిఫ్ట్ ల గురించి మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. ప్రభుత్వ విప్ , ఆలేరు శాసనసభ్యులు బీర్ల ఐలయ్య మాట్లాడుతూ కాళేశ్వరం 15వ ప్యాకేజీ 8 కిలోమీటర్ల కాలువ తవ్వితే 20 చెరువులకు నీరు వస్తుందని, అందువల్ల కొత్త డి పి ఆర్ కు అనుమతి ఇవ్వాలని కోరారు. అలాగే రుణమాఫీకి సంబంధించి ఏపీజీవీబీ బ్యాంకులో ఖాతాలు ఉన్న రైతులకు ఐఎఫ్ఎస్ సి కోడ్ సమస్య వల్ల నిధులు వెనక్కి వెళ్ళాయని, ప్రభుత్వంతో మాట్లాడి ఈ సమస్యను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. బస్వాపూర్ పునరావస కేంద్రానికి నిధులు ఇవ్వాలని భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి కోరగా, నిధులు విడుదల చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. నాగార్జునసాగర్ నియోజకవర్గంలో పెండింగ్లో ఉన్న ఇరిగేషన్ ప్రాజెక్టు ట్రాన్స్కో బిల్లులను మంజూరు చేయాలని, గుర్రంపోడు బస్టాండు ఏర్పాటు విషయమై ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ 20 ఫీట్లు వెనక్కి జరపాలని, డొంకతండ, బోయ గూడెం గ్రామాలలో ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమ పథకాల స్వీకరించిన దరఖాస్తులు కనిపించడం లేదని, వెబ్సైట్ ను మరోసారి ఓపెన్ చేయించి ప్రజల నుండి మరోసారి దరఖాస్తులు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. నాగార్జునసాగర్ శాసనసభ్యులు కుందూరు జైవీర్ రెడ్డి కోరారు. రాచకాలువకు ఇన్చార్జి ఇంజనీరింగ్ అధికారిని నియమించాలని, రుద్రమదేవి చెరువు 800 మీటర్లు తీస్తే చెరువు నిండుతుందని అందువల్ల వీటిపై దృష్టి సారించాలని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామెల్ కోరిన మేరకు మంత్రి వెంటనే ఈ విషయంపై చర్య తీసుకుంటామని తెలిపారు. దేవరకొండ శాసనసభ్యులు బాలునాయక్ పెండ్లిపాకల ఎత్తిపోతల పథకం గురించి మాట్లాడారు. నకిరేకల్ శాసనసభ్యులు వేముల వీరేశం మాట్లాడుతూ.. బ్రాహ్మణ వెల్లేముల భూసేకరణకు నిధులు మంజూరు చేయాలని, ఐటిపాముల భూసేకరణ పూర్తి చేయాలని, పిల్లాయిపల్లి, ధర్మారెడ్డి కాల్వల కు శంకుస్థాపన చేయాలని, రైతులకు ఎరువులు అందుబాటులో ఉంచాలని విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం మాట్లాడుతూ.. మునుగోడు పరిధిలోని శివన్న గూడెం ఇతర ప్రాజెక్టులను పూర్తి చేయాలని, రెండో విడత ఎక్కువ మందికి ఇందిరమ్మ ఇండ్లు కేటాయించాలని ,ఇదివరకే బేస్మెంట్ నిర్మించుకున్న వారికి సడలింపు ఇవ్వాలని ,సంస్థాన్ నారాయణపూర్ లో ఇసుక కొరత ఉందని ఆ సమస్యను పరిష్కరించాలని, ప్రైవేట్ ఆస్పత్రులు, విద్యాసంస్థల్లో ఫీజులను నియంత్రించాలని కోరారు. సమావేశం ప్రారంభమైన వెంటనే నల్గొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవర్, యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు, నీటిపారుదల ,విద్య, వ్యవసాయం, వైద్యం ,ఆరోగ్యం, భూభారతి, మహిళా శక్తి, సంక్షేమం తదితర అంశాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సమావేశానికి వివరించారు. ఉమ్మడి జిల్లా వ్యవసాయ అధికారులు, వైద్య ఆరోగ్యశాఖ అధికారులు వారి శాఖల ద్వారా అమలు చేస్తున్న కార్యక్రమాలను వివరించారు. ఎమ్మెల్సీ శంకర్ నాయక్ ,రాష్ట్ర డైరీ డెవలప్మెంట్ చైర్మన్ గుత్తా అమిత్ రెడ్డి ,మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి, రెవిన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, సబ్ కలెక్టర్ నారాయణ అమిత్ ,నల్గొండ, యాదాద్రి భువనగిరి, సూర్యాపేట జిల్లాల అదనపు కలెక్టర్లు, జిల్లా అధికారులు, తదితరులు ఈ సమీక్ష సమావేశానికి హాజరయ్యారు.

# ఫీజు రియింబర్స్మెంట్, స్కాలర్షిప్‌లను విడుదల చేయాలని పి.డి.ఎస్.యు ఆధ్వర్యంలో విద్యాసంస్థల బంద్

**నల్లగొండ , జూలై 2 (వార్తా వేదిక సూర్య):** నాలుగు సంవత్సరాలుగా తెలంగాణ రాష్ట్రంలో పెండింగ్లో ఉన్న 7200 కోట్ల రూపాయల స్కాలర్షిప్, ఫీజు రియంబర్స్మెంట్ లను తక్షణమే విడుదల చేయాలని పి డి ఎస్ యు ఆధ్వర్యంలో నల్లగొండ జిల్లా కేంద్రంలో డిగ్రీ, ఇంజనీరింగ్, ఫార్మసీ, బీఈడీ విద్యాసంస్థల బందును నిర్వహించడం జరిగింది ఈ బందుకు విద్యార్థులు యాజమాన్యాలు స్వచ్ఛందంగా మద్దతు ప్రకటించి బందు పాటించాయి .ఈ సందర్భంగా పి డి ఎస్ యు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఇందూరు సాగర్, జిల్లా ప్రధాన కార్యదర్శి పోలే పవన్, పి వై ఎల్ జిల్లా ప్రధాన కార్యదర్శి బీవీ చారి, టీఎస్ యు జిల్లా అధ్యక్షుడు కొండెడు మురళి పాల్గొని మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్రంలో ఫీజు రియంబర్స్మెంట్ రాక, స్కాలర్షిప్లు లేక, విద్యార్థులు స్వయంగా చెల్లించే స్తోమత లేక తీవ్రమైన ఇబ్బందులకు గురవుతున్నారని, జాతీయ స్థాయిలో యూజీ పీజీ చదవడానికి అన్ని సెంట్రల్ యూనివర్సిటీలలో ఎంట్రెన్స్ టెస్ట్, కౌన్సిలింగ్ జరుగుతున్నాయని, అనేకమంది పేద విద్యార్థులు సెంట్రల్ యూనివర్సిటీలలో చదువుకోవడానికి ర్యాంకులు సంపాదించి సర్టిఫికెట్స్ చేతుల్లో లేక, సెంట్రల్ యూనివర్సిటీలో చదువుకునే అవకాశాన్ని కోల్పోతున్నారని, మన రాష్ట్రంలో కూడా




యూనివర్సిటీలలో ఉన్నత విద్యా చదువుకోవడానికి సిపి జిఈటి, పిజి, ఈసెట్, లాసెట్, బిఈడి ఎంట్రెన్స్ లో నోటిఫికేషన్ విడుదలై పరీక్షలు జరుగుతున్నాయని, ఫైనల్ ఇయర్ పాసై ఉన్నత విద్య చదువుకోవాలంటే ఫీజు రియంబర్స్మెంట్, స్కాలర్షిప్ రాక, ప్రైవేటు యజమాన్యాలు సర్టిఫికెట్స్ ఇవ్వక, పేద బడుగు, బలహీన వర్గాల విద్యార్థులు ఉన్నత చదువులకు దూరమయ్యే ప్రమాదం ఉందని వారు అన్నారు. విద్యార్థులు, విద్యార్థి సంఘాల పోరాటాల ఫలితంగా నాటి వైయస్ రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వం ఫీజు రీయింబర్స్మెంట్ పథకాన్ని 2008లో తీసుకువచ్చిందని, నేడు అదే కాంగ్రెస్ ప్రభుత్వం రియంబర్స్మెంట్ పథకాన్ని ఎత్తివేసే ఆలోచనలో ఉన్నదని దుయ్యబట్టారు. విద్యా రంగానికి పెద్దపీట వేస్తామని ప్రగల్బాలు పలికిన రేవంత్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వం. అధికారంలోకి వచ్చి 18 నెలలు గడుస్తున్న ఇప్పటివరకు విద్యార్థులకు ఫీజులు చెల్లించలేదని ఎద్దేవ చేశారు. రాష్ట్రంలో ఎమ్మెల్యేలకు ,మంత్రులకు, ప్రజాప్రతినిధులకు ప్రతినెల లక్షల్లో జీవితాలిస్తూ, తమ పార్టీ నాయకుల విగ్రహాలకు కోట్లాది రూపాయలను వెచ్చిస్తూ, ప్రపంచ అందాల పోటీలకు 200 కోట్లకు పైగా ప్రజాధనాన్ని నీళ్ళలాగా ఖర్చు చేసిన ప్రభుత్వం. తమ పార్టీకి చెందిన కాంట్రాక్టర్లకు కోట్ల రూపాయలు బిల్లులు విడుదల చేస్తున్న ప్రభుత్వం. పేద విద్యార్థుల చదువులకు ఎందుకు కేటాయించడం లేదని ప్రశ్నించారు. ఫీజు రియంబర్స్మెంట్ పథకాన్ని ఎత్తివేసే ఆలోచనలు విరమించుకోవాలని, పెండింగ్లో ఉన్న ఫీజు రియంబర్స్మెంట్, స్కాలర్షిప్లను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు లేని పక్షంలో రాష్ట్రవ్యాప్తంగా బలమైన విద్యార్థి ఉద్యమాలను చేపడతామని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో పి డి ఎస్ యు నాయకులు ఎస్.కె సోయల్, చందన్, బి నరసింహ, నగేష్, వీరేష్, రాజు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# బెస్ట్ అవైలబుల్(బాస్) స్కీమ్ కింద పెండింగ్లో ఉన్న నిధులను విడుదల చేయాలి

**"కులాంతర వివాహ ప్రోత్సాహక నిధులు విడుదల చేయాలి"**

**"ఎస్సీ హాస్టళ్లలో సౌకర్యాలు మెరుగుపరిచి నూతన భవనం నిర్మించాలి"**

**ఎస్సీ విద్యార్థుల పోస్టుమట్రిక్ స్కాలర్షిప్లను విడుదల చేసేందుకు చర్యలు తీసుకోవాలి**

**మాజీ మున్సిపల్ చైర్మన్ బర్రె జహంగీర్**

**భువనగిరి,జూలై 2(వార్త వేదిక సూర్య):** మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కి బర్రె జహంగీర్ మాజీ మున్సిపల్ చైర్మన్ వినతి పత్రం అందజేసి వివరించడం జరిగింది

జిల్లాలోని ఎస్సీ ప్రభుత్వ విద్యార్థినుల వసతి గృహాల్లో సౌకర్యాలు మెరుగుపర్చేందుకు నూతన భవనం నిర్మించేందుకు నిధులు మంజూరు చేయాలని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ ని బర్రె జహంగీర్ భువనగిరి మాజీ మున్సిపల్ చైర్మన్ కలిసి వినతిపత్రం అందజేశారు. బుధవారం ఉమ్మడి నల్లగొండ జిల్లా కేంద్రంలోని జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో ఉమ్మడి జిల్లా అభివృద్ధి సంక్షేమ కార్యక్రమానికి వెళ్తూ యాదాద్రి లక్ష్మి నరసింహ స్వామీ దర్శనానికి వచ్చిన మంత్రి లక్ష్మణ్ ని ఆయన మర్యాదపూర్వకంగా కలిసి భువనగిరి జిల్లా కేంద్రంలోని బెస్ట్ అవైలబుల్(బాస్) స్కీమ్ కింద ప్రైవేట్ స్కూలులో చదువుతున్న విద్యార్థులకు ఇవ్వవలసిన నిధులు గత ప్రభుత్వంలో పెండింగ్లో ఉండడం వల్ల స్కూల్ యాజమాన్యాలు వాళ్ళు ఆర్థిక భారం మోయలేక ఎస్సీ విద్యార్థులకు ఆర్థిక భారంతో యూనిఫామ్ లు, బుక్స్, ఫీజులు, చెల్లించాలని విద్యార్థులపై వారి తల్లిదండ్రులపై ఒత్తిడి తీసుకొస్తున్నందున తక్షణమే బెస్ట్ అవైలబుల్ (బాస్) నిధులను విడుదల చేయాలని, ఎస్సీ బాలికల వసతి గృహాలలో ఉన్న సమస్యలను వివరించారు. ఎస్సీ విద్యార్థుల పోస్టుమట్రిక్ స్కాలర్షిప్లను సైతం విడుదల చేయాలని అలాగే ఎస్సీ కులాంతర వివాహం చేసుకున్న వివాహితులకు రావలసిన ప్రోత్సహకం నిధులు లేక ఆగిపోయినందున వెంటనే వాటిపై దృష్టి సారించి నిధులను విడుదల చేయాలని మంత్రిని కోరారు. భువనగిరి జిల్లా కేంద్రంలో ఎస్సీ బాలికల వసతి గృహం నిర్మించేందుకు నిధులను విడుదల చేసి విద్యార్థుల సంఖ్యకు తగినన్ని గదులను అందుబాటులోకి తేవాలన్నారు. ప్రస్తుతం ఉన్న వసతి గృహాలలో సరైన సదుపాయాలు లేనందువల్ల విద్యార్థినులు అసౌకర్యానికి



గురవుతున్నారని వెంటనే ఈ సమస్యను పరిష్కరించాలన్నారు. సానుకూలంగా స్పందించిన మంత్రి సంబంధించిన అధికారులతో సమీక్ష నిర్వహించి వెంటనే కావలసిన నిధులను విడుదల చేస్తానని హామీ ఇచ్చినట్లు మాజీ మున్సిపల్ చైర్మన్ తెలిపారు.

Printed, Published and Owned by **POLOJU SRINIVASA CHARY**,and **Printed at SURYA DIGITAL PRINTERS,** H.No.132, Markondeya Nagar, Choutuppal Municipality, YadadriBhuvanagiri District, Telangana State508252., and Published at H.No. 132, Markondeya Nagar, Choutuppal Municipality, YadadriBhuvanagiri District, Telangana State508252. **Editor: POLOJU SRINIVASA CHARY. RNI No: TGTEL/25/A0305,** Cell:9985389183. **Email Id:vaarthavedhikasurya.yadadri@gmail.com**